క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption
హైదరాబాద్
31-8-2025
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:15
సంచిక: 151
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## తెలంగాణ కేబినెట్
# సంచలన నిర్ణయం

రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేయాలని తీర్మానం

సెప్టెంబర్‌లోగా స్థానిక ఎన్నికల నిర్వహణకు అంగీకారం

ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అజారుద్దీనల పేర్లు సిఫార్సు



తెలంగాణ కేబినెట్ సంచలన నిర్ణయం తీసుకుంది. రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేయాలని నిర్ణయించింది. పంచాయతీ రాజ్ చట్టం2018 సవరణకు ఆమోదం తెలిపిన కేబినెట్.. రిజర్వేషన్ల పరిమితిపై గత ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్ స్థానంలో ఈ అసెంబ్లీలో ప్రత్యేక బిల్లు ప్రవేశ పెట్టాలని నిర్ణయించింది.

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** అసెంబ్లీ తర్వాత ప్రత్యేక జీవో తెచ్చి కులగణన ఆధారంగా తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని చూస్తోంది. మొత్తానికి స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయనే దానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెర దింపింది. తాజాగా స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సెప్టెంబర్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో ఎన్నికల కమిషన్‌కు తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో శనివారం భేటీ- అయిన తెలంగాణ కేబినెట్ పలు కీలక నిర్ణయాలు చేసింది. స్థానిక ఎన్నికల రిజర్వేషన్లలో పరిమితి ఎత్తివేయాలని కూడా కేబినెట్ నిర్ణయించింది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరాం పేర్లను గవర్నర్‌కు క్యాబినెట్ సిఫార్సు చేసింది.

- మిగతా 2వ పేజీలో

## పేదల కోసం తపించిన మహానేత సురవరం

ఆయన ఆశయాలు కొనసాగించేందుకు కృషి

సురవరం సంస్మరణ సభలో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** పేదల జీవితాలలో మార్పు రావాలని.. వారి కోసం నిరంతరం శ్రమించిన గొప్ప నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

3లో



## రెండు రోజులంటే ఎలా

కాళేశ్వరంతో చర్చకే ప్రాధాన్యం

వరదలపై చర్చిద్దామంటే బురదరాజకీయం

అందుకే బీఏసీ నుంచి వాకౌట్ చేశాం

బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** రెండు రోజులే అసెంబ్లీ నడిపిస్తామని ప్రభుత్వం అంటోందని, ప్రజా సమస్యలపై చర్చించకుండా పారిపోతున్నారని

2లో

## యూరియా కొరతపై బిఆర్ఎస్ డ్రామాలు

వీరి రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారు

మండిపడ్డ వ్యవసాయ మంత్రి తుమ్మల



హైదరాబాద్,ఆగస్ట్30(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో యూరియా కొరత ఉందంటూ ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ చేసిన ఆందోళనపై

## ప్రారభమయిన తెలంగాణ అసెంబ్లీ

దివంగత ఎమ్మెల్యే గోపీనాథ్‌కు అసెంబ్లీ సంతాపం

మాగంటి గోపీనాథ్మాస్ లీడర్ అంటూ రేవంత్ నివాళి

మండలిలో దివంతగత సభ్యులకు సంతాప తీర్మానం

ఉభయ సభలు సోమవారానికి వాయిదా

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ శాసనసభ, మండలి సమావేశాలు ప్రారంభమయ్యాయి. నాలుగైదు రోజుల పాటు ఈ సమావేశాలు నిర్వహించే అవకాశాలున్నాయి. నూతనంగా ఎన్నికై- శాసనమండలి సభ్యులను మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సభకు పరిచయం చేశారు. అలాగే ఇటీవల మృతిచెందిన మండలి మాజీ సభ్యులు మాగం రంగారెడ్డి, రత్‌ఆకర్‌లకు సభ నివాళి అర్పించిన

2లో

## గన్‌పార్క్ వద్ద బిఆర్ఎస్ నిరసన



- యూరియా కొరతపై బిఆర్ఎస్ ఆందోళన
- కమిషనర్‌కు వినతి పత్రం సమర్పణ
- సచివాలయం ముందు ఆకస్మిక ధర్నా
- కెటిఆర్, హరీష్ తదితరులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- పిసి ఘోష్ కాదు..సిసిసి ఘోష్ అంటూ ఎద్దేవా
- కాళేశ్వరం మొదలు అన్ని అంశాలపైచర్చకు సిద్దం
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ వెల్లడి

2లో

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** శనివారం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న ఎరువుల సంక్షోభంపై భారత రాష్ట్ర సమితి

## టారిఫ్‌లు అక్రమం

అమెరికా అప్పీళ్ల కోర్టు సంచలన తీర్పు

ట్రంప్‌కు శరాఘాతం

యూఎస్ సుప్రీంకోర్టులో సవాల్ చేయనున్న ట్రంప్ సర్కార్

వాషింగ్టన్: శత్రుదేశాలు, మిత్ర దేశాలు అనే తేడా లేకుండా ఎడాపెడా టారిఫ్‌ల వాతలు పెట్టిన

9లో




## మారుతున్న అంతర్జాతీయ సమీకరణాలు

మోడీ చైనా పర్యటనపై సర్వత్రా ఆసక్తి

శాశ్వత మిత్రులు, శత్రువులు ఉండరన్న రాజ్‌నాథ్ సింగ్



2లో

## రాయలసీమను రతనాల సీమగా మారుస్తా

ప్రతి చెరువును నీటితో నింపే ప్రయత్నం చేస్తా

అభివృద్ధిని అడ్డుకుంటున్న వైకాపాకు అడ్డుకట్ట వేస్తాం

పరమసముద్రం సభలో చంద్రబాబునాయుడు

# మాతరుతున్న అంతర్జాతీయ సమీకరణాలు

(మొదటి పేజీ తరువాయి)

**న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్):** ట్రంప్ సుంకాల బాదుడు వేళ అంతర్జాతీయ సమీకరణాలు మాతరుతు న్నాయి. మోడీ చైనా పర్యటనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ సందర్భంగా శాశ్వత మిత్రులు, శతృవులు ఉండరని రాజ్‌నాథ్ సింగ్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నారు. ఆయా దేశాల మధ్య శాశ్వత మిత్రత్వం.. శత్రుత్వం అంటూ ఏమీ ఉండదని, అలాగే శాశ్వత మిత్రులు కాని, శత్రువులు కాని ఉండరని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. కేవలం ఏదేశానికి తగ్గట్లుగా ఆ దేశానికి ఉపయోగపడే శాశ్వత ప్రయోజనాలే ఉంటాయని ఆయన వ్యాఖ్యానించారు. అలాగే రక్షణరంగంలో ఆత్మనిర్భరత సాధించడం అత్యావశ్యకమని ఓ జాతీయ మీడియా సదస్సులో పాల్గొని మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడి-ఆపరేషన్ సిందూర్ తదనంతర పరిణామాలు, ట్రంప్ టారిఫ్‌లు, ప్రధాని మోదీ చైనా పర్యటన నేపథ్యంలో భారత్ అనుసరిస్తోన్న వైఖరిని వెల్లడించారు. ప్రపంచం వేగంగా మారుతోంది. అదే సమయంలో కొత్త సవాళ్లు పుట్టుకొస్తున్నాయి. మహమ్మారులు, ఉగ్రవాదం, ప్రాంతీయ ఘర్షణలు వంటి వాటితో ఈ శతాబ్దం అత్యంత సవాలుతో కూడి ఉందని అర్థమవుతోంది. ఈనేపథ్యంలో మన వ్యూహాత్మక అవసరాల దృష్ట్యా.. ఆత్మనిర్భరత అనేది అత్యావశ్యకం అన్నారు. మనకు శాశ్వత శత్రువులు, మిత్రులు ఉండరు. శాశ్వత ప్రయోజనాలే ఉంటాయి. భారత్ ఎవరినీ శత్రువుగా పరిగణించదని కూడా వెల్లడించారు. మన రైతులు, వ్యాపారవేత్తల ప్రయోజనాలే మనకు ముఖ్యం. ప్రస్తుతం మారుతున్న భౌగోళిక రాజకీయాల కారణంగా రక్షణ పరంగా విదేశాలపై ఆధారపడటం సరైన ఎంపిక కాదని స్పష్టమవుతోందని అన్నారు. స్వావలంబన అనేది మన ఆర్థిక వ్యవస్థకు, భద్రతకు అత్యవసరం.

# ప్రారభమయిన తెలంగాణ అసెంబ్లీ

అనంతరం సోమవారానికి వాయిదే పడింది. అసెంబ్లీలో మరోవైపు ఇటీవల మృతి చెందిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతికి సబ సంతాపం ప్రకటించింది. గోపీనాథ్ మృతిపట్ల సీఎం రేవంత్‌రెడ్డి శాసనసభలో సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. విద్యార్థి రాజకీయాల్లో గోపీనాథ్ చురుగ్గా ఉండేవారని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. 1985 నుంచి 1992 వరకు తెలుగు యువత అధ్యక్షుడిగా పని చేశారని, ఎన్టీఆర్‌కు విశ్వాసపాత్రుడిగా గోపీనాథ్‌కు సత్సంబంధాలు ఉండేవన్నారు. విద్యార్థి నేతగా , ప్రజాప్రతినిధిగా, సినీ నిర్మాతగా రాణించారని చెప్పారు. గోపీనాథ్ తనకు మంచి మిత్రుడని, సన్నిహితుడని గుర్తు చేసుకున్నారు. గోపీనాథ్ తనకు చిన్ననాటి నుంచే మిత్రుడని పేర్కొన్నారు. ఆయన మృతి తనను వ్యక్తిగతంగా తీవ్రంగా కలిచివేసిందని గోపీనాథ్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సంతాప తీర్మానం ప్రవేశపెట్టిన సందర్భంగా సీఎం రేవంత్ మాగంటి గోపీనాథ్ జీవన ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. రాజకీయంగా పార్టీలు వేరైనా.. వ్యక్తిగతంగా నాకు మంచి మిత్రుడని తెలిపారు. ఆయన విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో చురుకుగా ఉన్నారని అన్నారు.

# రాయలసీమను రతనాల సీమగా మారుస్తా

**కుప్పం,(క్రైమ్ మిర్రర్):** రాయలసీమను రతనాలసీమగా చేసే బాధ్యత తనదని ముందే చెప్పానని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రతి చెరువుకు నీళ్లిచ్చే బాధ్యత నాది. పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో 110 చెరువులకు నీళ్లిచ్చే అవకాశం ఉంది. కుప్పంలో 520 చెరువులు ఉన్నాయి. గొలుసుకట్టు- చెరువులు ఉన్నాయి. చెక్‌డ్యామ్‌ల ద్వారా నీళ్లిచ్చే అవకాశం ఉంది. కృష్ణా జలాలను 730 కిలోమీటర్లు తీసుకొచ్చిన ఘనత తెదేపాది. ముఠా రాజకీయాలు లేకుండా చేసిన పార్టీ తెదేపా. హంద్రీనీవా ఫేజ్-1, ఫేజ్-2 వల్ల 6 లక్షల ఎకరాలకు సాగునీరు వస్తుంది. 33 లక్షల మందికి తాగునీరు అందుబాటు-లో ఉంటు-ంది. పరిశ్రమలకు కూడా నీళ్లొస్తాయి. ఇప్పుడు కుప్పానికి నీళ్లొచ్చాయి. రాబోయే ఏడాదికి హంద్రీనీవా ద్వారా చిత్తూరుకు కూడా నీళ్లిచ్చే బాధ్యత నాది. రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీళ్లివ్వగలిగితే నా జన్మ సార్థకమవుతుందన్నారు. 2014-2019 మధ్య కాలంలో రాయలసీమ ప్రాజెక్టు కోసం రూ.12,500 కోట్లు- ఖర్చు పెట్టినట్లు చెప్పారు. కానీ, వైకాపా పాలనలో కేవలం రూ.2 వేల కోట్లు- ఖర్చుపెట్టారని విమర్శించారు. కుప్పం నియోజకవర్గంలో పర్యటించిన ఆయన.. పరమసముద్రం వద్ద కృష్ణమ్మకు జలహారతి ఇచ్చారు. అనంతరం ఏర్పాటు- చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. గేట్లతో సెట్టింగ్‌లు వేసి నీళ్లు కూడా బయటి నుంచి తీసుకొచ్చి నాటకాలాడిన ఘటనలు చూశాం. విమానం ఎక్కేలోపే నీళ్లన్నీ ఇంకిపోయిన పరిస్థితులు చూశాం. అసత్యాలు చెప్పడంలో వైకాపా దిట్ట. అసాధ్యాలను సుసాధ్యం చేయడం ఎన్డీయే లక్ష్యం అన్నారు. నీళ్లు వచ్చేసరికి వైకాపా నేతలు జీర్ణించుకోలేక పోతున్నారు. ప్రతి చెరువుకు నీళ్లిచ్చే బాధ్యత నాది. మల్యాలలో ప్రారంభించి కుప్పం పరమసముద్రానికి నీళ్లు తీసుకొచ్చాం. 27 లిఫ్ట్ ఇరిగేషన్లు పెట్టి ఎక్కడికక్కడ నీళ్లు తరలిస్తున్నాం. కుప్పానికి రెండేళ్ల కంటే ముందే కృష్ణా పుష్కరాలు వచ్చాయి. గతంలో రాయలసీమలో కరవు వస్తే.. పశువుల కోసం రైలులో నీళ్లు తెప్పించి కాపాడుకున్నాం. నేను ఏ పని చేయాలన్నా వెంకన్నపై భారం వేసి బుల్లెట్‌లా దూసుకెళ్తా. పవిత్రమైన సంకల్పం ఉంటే ఏ పనైనా జయప్రదమవుతుందన్నారు. పోలవరం-బనకచర్ల పూర్తయి వంశధార నుంచి పెన్నానది వరకు అనుసంధానం చేయగలిగితే కరవనేదే ఉండదన్నారు. నదుల అనుసంధానం ఉపయోగాన్ని తెలంగాణ నేతలు తెలుసుకోవాలి. నీళ్లు సద్వినియోగం చేసుకోవాలని వారికి సూచిస్తున్నా. నీళ్లు లేనప్పుడే వాటి విలువ తెలుస్తుంది. జలాశయాల్లో నీటి నిల్వ ఎంత ముఖ్యమో, భూమినే జలాశయంగా తయారు చేసుకోవడం అంతకంటే ముఖ్యం. ఒక యజ్ఞం ద్వారా అభివృద్ధి కోసం ముందుకెళ్తున్నాం. దానిని భగ్నం చేసేందుకు వైకాపా అన్ని విధాలా ప్రయత్నిస్తోంది. మీకు చేతనైతే అభివృద్ధి, సంక్షేమంలో పోటీపడండని పిలుపునిస్తున్నట్లు చంద్రబాబు చెప్పారు. వైకాపా ఒక విషవృక్షంగా తయారైంది. మనం ఏ మంచి పని చేస్తున్నా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని చంద్రబాబు మండిపడ్డారు.

# గన్‌పార్క్ వద్ద బిఆర్ఎస్ నిరసన

(మొదటి పేజీ తరువాయి)




వినూత్న నిరసన చేపట్టింది. గన్‌పార్క్ వద్ద అమరులకు నివాళి అర్పించి అసెంబ్లీకి వచ్చారు. అమరుల స్థూపం వద్ద కాసేపునిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇందులో భాగంగా కనీసం 15 రోజులపాటు- అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆయన గన్‌పార్క్ వద్ద మీడియాతో మాట్లాడారు.. అసెంబ్లీ సమావేశాలు కనీసం 15 రోజులు లేదా అంతకు మించి నిర్వహించినా తాము సిద్ధమే అని కేటీఆర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ అంశాన్ని సభలో పెట్టినా.. అన్నింటికీ సరైన సమాధానం ఇస్తామని ధీమా వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగం నుంచి మొదలుకొని ఏ అంశం పైననైనా సభలో చర్చకు పెడితే ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు- పేర్కొన్నారు. వ్యవసాయ విస్తీర్ణంతో పాటు- వ్యవసాయ సంక్షేమానికి మాజీ సీఎం కేసీఆర్ చేసిన కార్యక్రమాలు, పథకాల గురించి వివరిస్తామని అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అయిన కాళేశ్వరం గురించి కూడా సమాధానం చెబుతామని కేటీఆర్ స్పష్టం చేశారు. అది పీసీ ఘోష్ కమిషన్ కాదు, అది కాంగ్రెస్ పార్టీ వేసుకున్న పీసీసీ ఘోష్ కమిషన్ అని కేటీఆర్ విమర్శించారు. వ్యవసాయ రంగం నుంచి మొదలుకొని ఏ అంశం పైననైనా సభలో చర్చకు పెడితే ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాము. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అయిన కాళేశ్వరం గురించి కూడా సమాధానం చెబుతాం. అసమ్మతి ఎమ్మెల్యేలకు సంబంధించిన అంశంలో స్పీకర్ ఏ నిర్ణయం తీసుకుంటారో చూద్దాం. ఇప్పటికే అసమ్మతి ఎమ్మెల్యేలకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోంది, ఏ నిర్ణయం తీసుకుంటారో చూద్దాం అని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు శాసనసభను తమకు అనుకూలంగా ఉండేలా నడిపించే ప్రయత్నం చేస్తోంది. రైతుల సమస్యల పైన, రాష్ట్రంలో ఉన్న ఎరువుల సంక్షోభం పైన మాట్లాడటం లేదు. 10 సంవత్సరాల పాటు కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఏ రోజు కూడా ఇలాంటి ఎరువుల కొరత రాలేదు. రైతులు లైన్లలో నిలబడాల్సిన దుస్థితి రాలేదు. మరి ఎందుకు ఈరోజు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చెప్పులను లైన్లో పెట్టడం, ఆధార్ కార్డులను లైన్లో పెట్టే పరిస్థితి వచ్చింది? పండుగ రోజు కూడా రైతులు ఎరువుల కోసం లైన్లలో నిలబడి, వర్షంలో తడిసి ఇబ్బందులు పడే పరిస్థితి ఎందుకు వచ్చింది? పంట నష్టపోయిన రైతుల గురించి కానీ, భారీ వర్షాల వల్ల ఇబ్బందుల గురించి గానీ సుదీర్ఘంగా చర్చించే అవకాశం అసెంబ్లీలో ఇవ్వండి. రాష్ట్రంలో ఉన్న వ్యవసాయ సంక్షోభం పైన అసెంబ్లీలో చర్చ పెట్టాలి అని కేటీ-ఆర్ డిమాండ్ చేశారు. 600కు పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. 75 లక్షల మంది రైతులు ఈరోజు అవస్థల్లో ఉన్నారు. రైతులకు కాంగ్రెస్ చేసిన మోసంపైన అసెంబ్లీలో చర్చ జరగాలి. ఆరు గ్యారెంటీ-ల నుంచి 420 హామీల అమలు వైఫల్యాల దాకా అన్ని అంశాలపైన చర్చిద్దాం. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల వల్ల వారు ఇబ్బందులు పడుతున్నారు, వాటి పైన చర్చ జరగాలి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం తమకు అనుకూలంగా ఉండే ఒకటి రెండు అంశాల పైననే మాట్లాడే ప్రయత్నం చేస్తోంది. ప్రజల కష్టాలు, సమస్యల పైన చర్చలకు అసెంబ్లీ వేదిక కావాలి. కనీసం 15 రోజులపాటు- అసెంబ్లీ సమావేశాలు జరగాలి. కాళేశ్వరంతో పాటు- అన్ని అంశాల పైన సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నాము. పీసీ ఘోష్ కమిషన్ పైన కూడా కాంగ్రెస్ పార్టీకి సమాధానం చెప్పడానికి మేము సిద్ధంగా ఉన్నాం అని కేటీఆర్ స్పష్టం చేశారు.

# తెలంగాణ కేబినెట్ సంచలన నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీ కమిటీ- హాలులో జరిగిన ఈ మంత్రివర్గ సమావేశంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంతో పాటు-, ఇటీ-వలి వర్షాలు, వరదలతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంపైనా చర్చించారు. పంటలు, రోడ్లు, ఇతర నష్టాలపై కేంద్ర ఆర్థికశాఖ సాయం కోరుతూ తీర్మానం చేశారు. కేబినేట్ వివరాలను మంత్రి పొంగులేటి మీడియాకు వివరించారు. మరోవైపు సెప్టెంబర్ 30లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఇప్పటికే హైకోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి కూడా క్యేబినెట్ నిర్ణయం తీసుకుందని అన్నారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు సెప్టెంబర్‌లోగా జరపాలని కోర్టు ఆదేశించింది. మొత్తం రిజర్వేషన్ల పరిమితి 50 శాతానికి మించకూడదని గత ప్రభుత్వం 2018 ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. దీనిపై ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం ఆర్డినెన్స్ చేసి గవర్నర్ కు పంపింది. ప్రస్తుతం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు రాష్ట్రపతి దగ్గర పెండింగ్ లో ఉందన్నారు. ముస్లీం కోటా పేరుతో బీజేపీ బిల్లును అడ్డుకుంటోంది. రాష్ట్రపతి ఆమోదం తెలపకుండా ప్రధాని మోదీ సర్కార్ అడ్డుకుంటోంది. కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా 42 శాతం రిజర్వేషన్లకు ఆమోదం తెలపాలని ఢిల్లీలో నిరసన కూడా తెలిపినట్లు వెల్లడంచారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ లుగా కోదండరాం, అజారుద్దీన్ పేర్లను సిఫారసు చేస్తూ తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు తీర్పుతో కేబినెట్ మరోసారి గవర్నర్ కోటా ఎమ్మెల్సీల పేర్లను సిఫారసు చేసింది. అయితే కోదండరాం పేరుతో పాటు- ఈ సారి అమిర్ అలీ ఖాన్ స్థానంలో అజారుద్దీన్ కు స్థానం కల్పించాలని నిర్ణయించారు. ఎమ్మెల్సీలుగా కోదండరాం, ఆమిర్ అలీఖాన్ నియామకాన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ 2024 ఆగస్టులో సుప్రీంకోర్టులో సివిల్ అప్లికేషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్ ను విచారించిన సుప్రీం కోర్టు.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంలో ప్రొఫెసర్ కోదండరాం, ఆమిర్ అలీ ఖాన్ కేసు విషయంలో 2025 ఆగస్టు 13 న స్టే విధించింది. 2024 ఆగస్టు 14న తాము ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల తర్వాత జరిగిన పరిణామాలు ఆ ఉత్తర్వులకు వ్యతిరేకంగా ఉంటే ఎమ్మెల్సీల నియామకాన్ని రద్దు చేస్తామని వ్యాఖ్యానించింది. అయితే.. ఏదైనా తుది ఉత్తర్వులకు లోబడే ఉంటుందని స్పష్టం చేస్తూ.. తదుపరి విచారణను 2025 సెప్టెంబర్ 17కు వాయిదా వేసింది. ఈ క్రమంలో మరోసారి గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పేర్లను సిఫారసు చేసింది తెలంగాణ కేబినెట్.. ఎమ్మెల్సీలుగా కోదండరాం, అజారుద్దీన్ పేర్లను ఖరారు చేసింది. అయితే ఈ సారి అమిర్ అలీ ఖాన్ ప్లేసులో అజారుద్దీన్ కు అవకాశం కల్పించింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో అజారుద్దీన్ కు ఎమ్మెల్సీ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. దీంతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ తరపున కొత్త అభ్యర్థికి అవకాశం రానుంది. ఇకపోతే బీసీ రిజర్వేషన్లపై కేబినెట్‌లో కీలక చర్చ జరిగిందని, అసెంబ్లీలో రిజర్వేషన్ బిల్లులను ఆమోదిస్తాం అని పొంగులేటి అన్నారు. భారీ వర్షాలతో కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో భారీ నష్టం వాటిల్లింది. పంట, ఆస్తి, రహదారుల నష్టం అధికంగా జరిగింది. వరద నష్టాన్ని అంచనా వేయాలని అధికారులకు చెప్పాం. వర్షాల వల్ల జరిగిన నష్టం అంచనాల పై సెప్టెంబర్ 4న ఉన్నతాధికారుల సమావేశం నిర్వహిస్తాం అన్నారు. గోలల పాలసీ విధి విధానాలపై చర్చించాం. 2022 - 23 లో రబీ ధాన్యం సేకరణకు టెండర్లు పిలిచారు. మిల్లర్లకు ఇచ్చిన 7లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రికవరీ కాలేదు.. వారి పై పీడీ యాక్ట్ పెట్టడాని-కై-నా ప్రభుత్వం వెనకాడదు.

# యూరియా కొరతపై బిఆర్ఎస్ డ్రామాలు

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఫైర్ అయ్యారు. యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వం కారణమని మీకు తెలియదా అంటూ ప్రశ్నించారు. కేంద్రం వల్ల యూరియా కొరత ఉంటే మాపై విమర్శలు చేస్తారా అని బీఆర్ఎస్ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదంతా కావాలని చేస్తున్న డ్రామాగా ఆయన అభివర్ణించారు. రేవంత్ సర్కార్‌ను బద్నాం చేసేందుకే బీఆర్ఎస్ దిగజారుడు రాజకీయం చేస్తోందని విమర్శించారు. యూరియా స్లపైలో నిర్లక్ష్యంపై కేంద్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. యూరియాపై బీఆర్ఎస్ నేతలది కపట నాటకమని.. బీఆర్ఎస్ నాటకాలను రైతులు నమ్మరని అన్నారు. అనవసరంగా రైతులను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో యూరియా సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారంబీఆర్ఎస్ నేతలు ఆందోళనకు దిగారు. ముందుగా వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగిన బీఆర్ఎస్ నేతలు.. యూరియా సమస్యను పరిష్కరించాలని వ్యవసాయ శాఖ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం తెలంగాణ సచివాలయం ముందు బైఠాయించి ఆందోళన చేశారు. ఈ ధర్నాలో హరీష్ రావు, కేటీ-ఆర్, తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బీఆర్ఎస్ ఆందోళనతో సచివాలయం దగ్గర కాసేపు ఉద్రిక్తత నెలకొంది. దీనిపై మంత్రి తుమ్మల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రెండు రోజులంటే ఎలా

మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. బీఏసీ నుంచి వాకౌట్ చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వరదల గురించి చర్చిద్దామంటే బురద రాజకీయాలు చేస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలు 15 రోజుల పాటు- నిర్వహించాలని బీఏసీలో కోరాం. వరద నష్టాలు, ఎరువుల కొరత, గురుకులాల్లో వందకుపైగా మరణాలు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ గురించి అసెంబ్లీలో చర్చించాలని కోరాం అని హరీశ్‌రావు తెలిపారు. వరదల మీద మాట్లాడుదామని అంటే.. వరదలు ప్రాధాన్యత కాదు బురద రాజకీయాలు మాట్లాడుకుందామని కాంగ్రెస్ ప్రభుత్వం అంటున్నదని హరీశ్‌రావు పేర్కొన్నారు. రెండే రోజులు అసెంబ్లీ జరిపి ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పారిపోవాలని చూస్తుందని ఆయన ధ్వజమెత్తారు. వరదలు, ఎరువుల మీద చర్చించాలని బీఏసీ సమావేశంలో మేం కోరాం. కానీ ఆ రెండింటి మీద చర్చించరట. అందుకే బీఏసీ నుంచి వాకౌట్ చేశాం. పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో లేని సమస్య ఇప్పుడు ఎందుకు వచ్చింది. వరదలు, యూరియా కొరతపై మాట్లాడాలని బీఆర్ఎస్ ప్రతిపాదించింది. ఈ రెండు అంశాలపై మాట్లాడాలని మేం కోరాం. వీటితో పాటు- గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేక వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. అంటు- రోగాల మీద, గురుకులాల్లో కనీస సౌకర్యాలపై, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై, ఫోర్త్ సీటి పేరు మీద జరుగుతున్న అక్రమాలు.. సీఎం కుటు-ంబ సభ్యుల పాత్రపై, ధాన్యం కుంభకోణంపై.. బాధ్యులపై, ప్రభుత్వ ఉద్యోగుల టీ-ఏ, డీఏలు, పీఆర్సీపై, గోదావరి బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై, హైడ్రా కూల్చివేతలు పేదలు పడుతున్న భాదలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో కనీస సౌకర్యాలపై చర్చించాలని కోరాం.




## సిఎం రేవంత్‌తో సిఎస్ భేటీ



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు శాసనసభ చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణా రావు సర్వీసును 7 నెలలు పొడిగిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ అయిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ని కలిశారు. తన సర్వీసును పొడగించినందుకు ఆయన సిఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

## గుత్తా అధ్యక్షతన మండలి బిఎసి సమావేశం

### చర్చించాల్సిన అంశాలపై ఎజెండా ఖరారు

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అధ్యక్షతన, ఆయన ఛాంబర్ లో బిజినెస్ అడ్వైసరి కమిటీ, సమావేశం జరిగింది. ఈ సమావేశానికి డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క, శాసన సభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు , డిప్యూటీ- ఛైర్మన్ బండ ప్రకాష్ , శాసన మండలి ప్రతిపక్షనేత మధుసూధనాచారి, చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి , ఎమ్మెల్సీలు మహేష్ కుమార్ గౌడ్, నెల్లికంటి సత్యం , తెలంగాణ లేజిస్లేచర్ సెక్రెటరీ డా. నరసింహా చార్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో మండలిలో చర్చించాల్సిన ఎజెండాను ఖరారు చేశారు. మండలికి సంబంధించి ప్రత్యేకంగా బిఎసి సమావేశం నిర్ణయం తీసుకోవడం విశేషం.

## మరో ఏడుగురు మావోల లొంగుబాటు



**ములుగు, (క్రైమ్ మిర్రర్):** ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ సమక్షంలో శనివారం నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన ఏడుగురు సభ్యులు లొంగిపోయారు. జిల్లా పోలీసులు, సీఆర్పీఎఫ్ బెటాలియన్ అధికారులు ఆదివాసీ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం సంయుక్తంగా పోరు కన్నా ఊరు మిన్న - మన ఊరికి తిరిగి రండి' పేరిట అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ కల్పిస్తున్న పునరావాస సదుపాయాల గురించి వివరిస్తున్నారు. వీటి గురించి తెలుసుకున్న నిషేధిత మావోయిస్టు పార్టీలో వివిధ హోదాలలో పనిచేస్తోన్న నలుగురు మహిళలు సహా ఏడుగురు సభ్యులు నక్సలిజాన్ని విడిచిపెట్టి ప్రశాంతమైన జీవితం గడపాలనే ఉద్దేశంతో ఎస్పీ ఎదుట లొంగిపోయారు. వీరిలో ఏరియా కమిటీ- సభ్యుడు(ఆఈః) తాటి ఉంగి, ముగ్గురు పార్టీ సభ్యులు కొడ్మే సుక్కు, పోడి భీమ్, కుంజం వరలక్ష్మి, పద్మం మరో ఇద్దరు ఉన్నారు.

## గోదావరికి పోటెత్తిన వరద

### నీట మునిగిన బాసర వీధులు

**ఆదిలాబాద్, (క్రైమ్ మిర్రర్):** నిర్మల్ జిల్లా బాసర వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. రెండు రోజులుగా వరద పెరగడంతో గోదావరి నుంచి సరస్వతి ఆలయం వరకు ప్రధాన రహదారి జలమయమైంది. వరదనీరు వ్యాసమహర్షి ఆలయానికి, ఆలయ ఆవరణలోని తితిదే గృహాల వరకు చేరుకుంది. ఆలయం వద్ద దుకాణాలు, ప్రైవేటు- లాడ్జీలు, సత్రాలన్నీ నీట మునిగాయి. దీంతో సరుకులు మొత్తం నీటిలో కొట్టుకు పోయాయని దుకాణదారులు విలపించారు. గంగాదేవి, సూర్యేశ్వర శివాలయం, అక్షర కాలనీ, ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్‌లు జలమయమయ్యాయి. అక్షర కాలనీలో చిక్కుకున్నవారిని ట్రాక్టర్ల సహాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. స్థానిక నాగభూషణ్ విద్యాలయంలో 30 మంది విద్యార్థులు, ఆరుగురు టీ-చర్లు చిక్కుకున్నారు. వరద చుట్టు- ముట్టడంతో భవనం పై అంతస్తుకు వెళ్లి తలదాచుకున్నారు. వారిని బయటకు తీసుకొచ్చేందుకు వెళ్లి మరో 8 మంది కూడా వరదనీటిలో చిక్కుకున్నారు.

## రైతులపై స్పందన లేని సిఎం రేవంత్

### బిజెఎల్‌పినేత ఎలేటి విమర్శలు

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** సీఎం రేవంత్ రెడ్డి గాలి మోటర్‌లో తిరుగుతూ గాలి మాటలు మాట్లాడుతున్నారని బీజేపీ శాసన సభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాల పెద్దఎత్తున పంట నష్టం జరిగిందని చెప్పారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రైతులను కాపాడాలన్న కనీస ఇంకిత జ్ఞానం ముంఖ్యమంత్రికి లేదన్నారు. వేలాది ఎకరాల్లో పంట నష్టం, ప్రాణ నష్టం జరిగిందని, రైతులు నష్ట పోయారని చెప్పారు. ముఖ్యమంత్రికి ఏమాత్రం సోయి లేకుండా అందాల పోటీ-ల మీద, మూసీ నదిపై రివ్యూలు నిర్వహిస్తూ కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. అసెంబ్లీలో చర్చకు రావాల్సిన అనేక సమస్యలు ఉన్నాయని, మూడు రోజులు మాత్రమే సభను నడపాల్సిన అవసరం ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. దీనికి ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలన్నారు. సీఎం చర్చలకు భయపడుతున్నారా అని ప్రశ్నించారు. భేషరతుగా 4 వారాలపాటు- అసెంబ్లీ నిర్వహించాలని, ముఖ్యమంత్రికి దమ్ము, ధైర్యం లేక తప్పించుకు తిరుగుతున్నారని విమర్శించారు.

# పేదల కోసం తపించిన మహానేత సురవరం






(మొదటి పేజీ తరువాయి)

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తను నమ్మిన సిద్ధాంతాలను చివరి వరకు ఆచరించిన అవిశ్రాంత యోధుడని కొనియాడారు. సమాజంలో అనాగరికాలు రూపుమాపేలా ఆయన ఎన్నో చైతన్య కార్యక్రమాలు చేపట్టారన్నారు. రవీంధ్రభారతిలో నిర్వహించిన సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభకు సీఎం హాజరయి మాట్లాడారు. మొదటితరంలో సురవరం ప్రతాపరెడ్డి, బూర్గుల రామకృష్ణారావు వంటి వారు పాలమూరు జిల్లాకు వన్నెతెచ్చారు. రెండో తరంలో జైపాల్‌రెడ్డి, సురవరం సుధాకర్‌రెడ్డి వంటివారు రాజకీయాల్లో రాణించారు. జైపాల్‌రెడ్డి దక్షిణ భారత్ నుంచి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ఎన్నికైన యువ ఎంపీగా ప్రజల్లో నిలిచిపోయారని అన్నారు. అదే కోవలో సురవరం సుధాకర్‌రెడ్డి కూడా గుర్తింపు తెచ్చుకున్ననేత అన్నారు. సిపిఐ కార్యార్శిగా, ఎంపిగా ఆయన చిరస్మరణీయ సేవలు అందించారని అన్నారు. ఆయన సిద్ధాంతాలు ప్రజలకు అర్ధమయ్యేలా చేస్తాం. ప్రజలకు సురవరం సుధాకర్‌రెడ్డి ఎప్పుడూ గుర్తుండేలా మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం అని అన్నారు. రాజకీయం అంటేనే అధికారం అన్నట్టుగా కొందరు వ్యవహరిస్తున్నారు. అధికారంలో ఉంటాం కానీ, ప్రతిపక్షంగా ఉండలేమన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఐదేళ్లు కూడా ప్రతిపక్షంగా వ్యవహరించేందుకు కొందరు ఇష్టపడట్లేదని పరోక్షంగా బిఆర్ఎస్‌పై విసుర్లు విసిరారు. కమ్యూనిస్టులు మాత్రం ఎన్నేళ్లు అయినా ప్రతిపక్షంలో ఉండేందుకు ఇష్టపడతారు. ప్రజల తరఫున మాట్లాడటం, పోరాడటం పెద్ద బాధ్యత. ప్రస్తుత రాజకీయాల్లో ప్రజల తరఫున పోరాడేందుకు నేతలు ముందుకు రావట్లేదు. సమస్యలపై పోరాడి.. ప్రజావ్యతిరేక ప్రభుత్వాలను దించడంలో కమ్యూనిస్టులు ముందున్నారని సీఎం వ్యాఖ్యానించారు. కేంద్రంలో ఏ ప్రభుత్వం దిగిపోయినా కమ్యూనిస్టులే కారణమని తన నమ్మకం తనదని సిఎం అన్నారు . రవీంధ్ర భారతిలో సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభకు హాజరయ్యారు రేవంత్. సురవరం చిత్రపటానికి నివాళి అర్పించారు. కమ్యునిస్టులంటేనే ప్రతిపక్షమని అన్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతం, ఆలోచన ఇంకా పెరగాలన్నారు రేవంత్. కమ్యునిజం అంటే లైబ్రరీలో దొరికే పుస్తకం కాదని.. కమ్యూనిస్టులంటేనే ప్రజల కోసం కొట్లాడే వాళ్లని అన్నారు. కమ్యూనిస్టులంటే ప్రజలకు ఓ భరోసా,నమ్మకం ఉందన్నారు. సురవరం ఉంటే ఓట్ చోరీపై మరింతగా పోరాడే వారరన్నారు. మహారాష్ట్రలో నాలుగు నెలల్లో కొత్తగా కోటి మంది ఓటర్లు పుట్టుకొచ్చారని ఆరోపించారు సీఎం రేవంత్. బీహార్ లో 65 లక్షల కొత్త ఓట్లు- వచ్చాయని చెప్పారు. ఓట్ల తొలగింపుతో ఈ సమస్యకు పరిష్కారం దొరకదన్నారు. సురవరం చివరి శ్వాస వరకు సీపీఐతోనే ఉన్నారని.. 65 సంవత్సరాల పాటు- ఎర్రజెండా నీడనే ఉన్నారని కొనియాడారు రేవంత్. సురవరం సామాజిక చైతన్యం ఉన్నవారన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి సూచనతోనే తెలుగు యూనివర్శిటీకి సురవరం ప్రతాప్ రెడ్డి పేరు పెట్టామన్నారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, నారాయణ, మంత్రి జూపల్లి కృష్ణారావు, సీపీఎం నేత బీవీ రాఘవులు, తమ్మినేని వీరభద్రం, గుమ్మడి నర్సయ్య, ప్రొ.హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## పవర్ పాయింట్ సంప్రదాయం ఎక్కడుంది?

### గతంలో మేం అడిగితే ఇవ్వలేదే అన్న భట్టి

### సమస్యలపై చర్చకు ఎప్పుడూ సిద్ధమన్న శ్రీధర్ బాబు



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** ప్రతిపక్షాలకు అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చే సంప్రదాయం లేదని డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. భారత రాష్ట్ర సమితి హయాంలో తాము పీపీటీకి అవకాశం ఇవ్వాలని లేఖ ఇచ్చినట్లు గుర్తుచేశారు. అప్పుడు తమకు ఎందుకు అవకాశం ఇవ్వలేదని ప్రశ్నించారు. అప్పడు లేని సంప్రదాయం ఇప్పుడు ఎలా ఉంటుందన్నారు. ప్రభుత్వం రూ. 6,500 కోట్ల వడ్డీ కట్టట్లేదనే భారత రాష్ట్ర సమితి వాదన సరికాదని పేర్కొన్నారు. మరి వడ్డీలు ఆ పార్టీ నేతలు కడుతున్నారా అని ప్రశ్నించారు. ప్రజలను ఎంతోకాలం తప్పుదోవ పట్టించలేరని అన్నారు. మరోవైపు శాసనసభలో కాళేశ్వరంపై పీపీటీకి అవకాశం ఇవ్వాలని భారత రాష్ట్ర సమితి నేతలు డిమాండ్ చేస్తున్నారు. తాము పూర్తి ప్రజాస్వామికంగా వ్యవహరిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు అందరికీ పూర్తిస్థాయిలో అవకాశం ఇస్తామన్నారు. తప్పులు చేసినవారికి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఎందుకు అని భారత రాష్ట్ర సమితి నేతలను ప్రశ్నించారు. తెలంగాణలోనే కాదు.. దేశం మొత్తం యూరియా కొరత ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. యూరియా కోసం సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రానికి లేఖ రాశారని చెప్పారు. కేంద్ర మంత్రులతో మాట్లాడి ఒత్తిడి తెచ్చారన్నారు. తమ ఒత్తిడితోనే యూరియా కొంత సాధించినట్లు- వివరించారు. తెలంగాణ అభివృద్ధే లక్ష్యమని కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి అన్నారు. ఆమె పార్టీ నేతలతో కలిసి గన్ పార్క్ వద్ద నివాళి అర్పించి మాట్లాడారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని విమర్శించారు. తమ ప్రభుత్వం ఒక్కొక్క సమస్యను పరిష్కరిస్తోందని వివరించారు. వరదలతో నష్టపోయిన వాళ్లను ఆదుకోవాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం అన్ని పార్టీలు ముందుకు రావాలి. కేసీఆర్ ఎందుకు అసెంబ్లీకి రావడం లేదు. ఫామ్ హౌస్‌లో ఉండటంలో అర్థం ఏమిటి? అసెంబ్లీకి రాను.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని కేసీఆర్‌ను చెప్పమనండని విజయశాంతి అన్నారు.

## ప్రజా సమస్యల కోసం నిరంతర పోరాటం

### విద్యార్థులతో కలిసి ఎన్నో ఉద్యమాలు

### సురవరం కు నివాళి అర్పించిన నేతలు

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సురవరం సుధాకర్‌రెడ్డి పనిచేశారని విశ్రాంత సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. వారి ఇబ్బందులపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ- సభ్యుడిగా నివేదికలు ఇచ్చారని గుర్తుచేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో విద్యార్థులతో కలిసి ఉద్యమాలు చేపట్టారని తెలిపారు. తనకు కూడా వామపక్ష భావజాలం పట్ల అభిమానం ఉందని పేర్కొన్నారు. సురవరం ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడిపారని కొనియాడారు. రవీంద్రభారతిలో దివంగత సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు- చేశారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, తమ్మినేని వీరభద్రం, సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ప్రొఫెసర్ హరగోపాల్, గుమ్మడి నర్సయ్య పాల్గొన్నారు. దశాబ్దానికిపైగా సురవరం, తాను కలిసి కమ్యూనిస్టు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లినట్లు- బీవీ రాఘవులు తెలిపారు. అనేక పోరాటాలు, ఉద్యమాల్లో కలిసి పని చేసినట్లు- వివరించారు. సురవరం గొప్ప ప్రజాస్వామిక వాది అని కొనియాడారు. ఆయన లేని లోటు- పూడ్చలేనిదని పేర్కొన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కమ్యూనిస్టులు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తాను ఎన్ఎస్‌యూఐ నాయకుడిగా ఉన్నప్పుడు తొలిసారి సురవరం సుధాకర్‌రెడ్డిని కలిసినట్లు- టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఇటీవల సీపీఐ రాష్ట్ర కార్యాలయం ప్రారంభోత్సవంలో మళ్లీ కలిసినట్లు- చెప్పారు. కమ్యూనిజం ఎప్పుడూ సజీవంగా ఉంటుందన్నారు. సురవరం నిబద్ధతతో రాజకీయాలు నడిపారన్నారు. ఆయన జీవితం ఎంతో మందికి ఆదర్శమని పేర్కొన్నారు.

## మరోమారు కాళేశ్వరంపై హరీష్ పిటిషన్

### పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు భయమెందుకని ప్రశ్న



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. కాళేశ్వరం కమిషన్ నివేదికను సస్పెండ్ చేయాలని మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. అసెంబ్లీలో కాళేశ్వరం కమిషన్ నివేదికను ప్రవేశపెట్టకుండా చూడాలన్నారు. ఈ పిటిషన్ ప్రస్తుతం హైకోర్టు రిజిస్ట్రీ పరిశీలనలో ఉంది. కాళేశ్వరం కమిషన్ నివేదికను కొట్టివేయాలని గతంలోనూ కేసీఆర్, హరీశ్‌రావు పిటిషన్లు దాఖలు చేశారు. పిటిషన్ల ఆధారంగా గతంలో విచారణ చేపట్టిన హైకోర్టు.. నోటీసులు జారీ చేసి వాయిదా వేసింది. అక్టోబర్ ఈ పిటిషన్లపై తదుపరి విచారణ చేపట్టనుంది. తప్పులు చేశారో.. లేదో తేల్చాల్సింది మంత్రులు, కాంగ్రెస్ పార్టీ కాదని హరీశ్‌రావు అన్నారు. అది తేల్చాల్సింది కోర్టులు, ప్రజలు అని పేర్కొన్నారు. కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు అవకాశం ఇవ్వట్లేదంటే.. అధికార పక్షం భయపడుతున్నట్లే అని పేర్కొన్నారు. వాస్తవాలు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదని విమర్శించారు. పీపీటీకి అవకాశం ఇవ్వడం లేదంటే.. వాస్తవాలను వినడానికి సిద్ధంగా లేరని అర్థం అవుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు అన్ని గమనిస్తున్నారని గుర్తు చేశారు. మంత్రి శ్రీధర్ బాబు మాటలు చూస్తుంటే.. ఆయనకు వాస్తవాన్ని అంగీకరించడం ఇష్టం లేదని తెలుస్తోందని అన్నారు. ఏ విషయం గురించైనా నిజానిజాలు కోర్టులో తెలుస్తాయని హరీష్ రావు స్పష్టం చేశారు.

ఎడిటోరియల్



# వ్యవసాయ విధానంలో లోపం

## సమగ్ర సాంకేతికతకు దూరం

## అనుబంధరంగాలకు దక్కని ప్రోత్సాహం

కేంద్రం మద్దతు ధరలు ప్రకటించి..రైతుకు అండగా ఉన్నామని చెప్పడం...అయినా రైతుల పరిస్థితి మారడం లేదు. ఇటీవలే మద్దతు ధరలను కేంద్రం సవరించింది. వరి మొదలుకుని పలు పంటలకు మద్దతు ధరలను పెంచింది. అయితే వ్యవసాయ ముఖచిత్రం మారినా...ఆర్థికంగా రైతులు, దానిని నమ్ముకున్న ఇతర పనివాళ్లు బాగు పడడం లేదు. ఇకపోతే విదేశాల నుంచి నూనెల దిగుమతి వేరుశనగ రైతులకు శరా ఘాతంగా మారింది. నూనెల ధరలు మండుతున్నా నూనెగింజల ఉత్పత్తిని ప్రోత్సహించడం లేదు. పంటల విధానంలో శాస్త్రీయ దృక్పథం లోపించడం, సేంద్రియ ఎరువుల బదులు రసాయన ఎరువులు వాడడం వల్ల భూసారం తగ్గుతోంది. ఆధునిక ఆర్థిక వ్యవస్థలో రైతుల సమస్యలు మరింత జఠిలం అవుతున్నాయే తప్ప పరిష్కారం కావడం లేదు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన వ్యవసాయిక విధానం లేకపోవడం రైతుల పాలిట శాపంగా మారిపోయింది. వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతన్నా రైతుల ఆర్థిక వ్యవస్థ మాత్రం బాగుపడడం లేదు. అవసరం ఉన్నా..లేకున్నా ఇబ్బడి ముబ్బడిగా ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోవడం కూడా రైతులకు శాపంగా మారింది. కల్తీలు కూడా రైతును కాటేస్తున్నాయి. మన అసవరాలకు సరిపడా కందులు, మిరప, ఇతర పంటలను రైతులు చెమటోడ్చి పండించినా వాటిని కొనుగోలు చేయడం లేదు. అలాగే మన అసవరాలకు అనగుణంగా పంటల విధానం తీసుకుని రావాలి. పంటల విధానంలో మార్పులు రావాలని రైతులతో పాటు, శాస్త్రవేత్తలు, నిపుణులు కూడా కోరుకుంటున్నారు. నిజానికి కార్పోరేట్ లేదా ఇతర కంపెనీలకు మించిన ఆదాయాన్ని, ఉద్యోగ కల్పనను వ్యవసాయరంగమే కల్పిస్తోంది. వ్యవసాయానికి పెద్దపీట వేసివుంటే ఈ రంగం దేశ ఆర్థిక పురోగతిలో కీలకం కానుంది. అయినా ఈ విషయంలో ప్రభుత్వాలది నిర్లక్ష్య ధోరణి తప్ప మరోటి కాదు. నేటికీ పంటల విధానం, కొనుగోళ్ల విధానం సక్రమంగా అమలు కావడం లేదు. ధాన్యాగారాల్లో మగ్గుతున్న ధాన్యం దేశం దాటి పోవడం లేదు. వాటిని ఇతర దేశాలకు అమ్ముకునేలా విధానాలు అమలు కావడం లేదు. బహుళజాతి కంపెనీలకూ ఎర్ర తివాచీలు

పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు. అనేక కంపెనీలకు ఇస్తున్న రాయితీల మాదిరి వ్యవసాయానికి కూడా రాయితీలు ఇచ్చి పంటల ఉత్పత్తిని సవాల్‌గా తీసుకుంటే దేశంలోని సగం దరిద్రం పోతుంది. ఈ క్రమంలో సేంద్రియ వ్యవసాయానికి చేయూతను ఇస్తే అంతర్జాతీయంగా మన పంటలకు డిమాండ్ కూడా పెరుగుతుంది. అలాగే దేశంలో ఉన్న వ్యవసాయ భూముల్లో ఎక్కడెక్కడ ఏ పంట పండుతుందో తెలుసుకుని.. అందుకు అనుగుణంగా పంటల విధానం తీసుకుని రావాలి. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టి యువతను ప్రోత్సహించడం ద్వారా నిరుద్యోగ సమస్యకు చెక్ పెట్టవచ్చు. కానీ అలా జరగడం లేదు. సస్యవిప్లవానికి నాంది పలికేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలకు పూనుకోవాల్సిన తరుణంలో వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారు. దేశీయంగా వ్యవసాయ పురోభివృద్ధికి పాటుపడడం లేదని వ్యవసాయరంగ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. అలా చేయడం వల్ల వ్యవసాయం రంగం అతిపెద్ద ఉత్పాదక రంగంగా మారగలదని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెంచితే మంచిది. తెలంగాణలో పండే జొన్న, మక్కజొన్న,సజ్జ పంటలకు సరైన ధరలు రావడం లేదు. రైతులను ఆదుకున్నామని చెబుతున్న ప్రభుత్వాలు..క్షేత్రస్థాయిలో రైతులు ధాన్యం కొనాటంలూ ఆందోళన చేస్తున్నా పట్టించుకోని దౌర్భాగ్యం నేటికీ కనిపిస్తోంది. రైతుల గురించి మాట్లాడుతున్న పాలకులు ధాన్యం కొనుగోళ్లలో వస్తున్న ఆందోళనలను పట్టించుకోవడం లేదు. ముందుగా వానాకాలం ... తరవాత యాసంగిలో ఏ ధాన్యం వేయాలో మండలాల వారీగా నిర్ణయించి.. రైతులకు సూచనలు చేయాలి. అవసరమైతే వారినిచైతన్యం చేయాలి.కానీ అందుకు భిన్నంగా ప్రభుత్వాలు వ్యయసాయ విధానాలను కొనసాగిస్తున్నారు. నిజానికి ధాన్యం కొనుగోలు అన్నది ఒక పంటకు ముందే నిర్ణయించాలి. ఏ పంట వేయాలో ముందే చెప్పాలి. కానీ అదేమీ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం మీద కేంద్రం...కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వాలు దుమ్మెత్తి పోసుకోవడం సరికాదు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఒకరి మీద ఒకరు నెపం నెట్టేసుకోవడం తప్ప ధాన్యం నిల్వలను కొనేందుకు నిర్దుష్ట ప్రణాళికతో ముందుకు రావడం లేదు.

# అక్షర సంకల్పానికి తూట్లు!

**ప్రతి ఆవాసంలోనూ స్కూలు పెట్టి పిల్లలకు విద్యను చేరువ చేయాలన్న సంకల్పంతో ఏర్పాటు చేసిన ఏకోపాధ్యా పాఠశాలలు కనుమరుగు అయ్యాయి. ప్రభుత్వ పాఠశాలలను ఓ క్రమపద్ధతిలో ప్రైవేట్ పాఠశాలలు మింగేశాయి. దీంతో మారుమూల గ్రామాల ప్రజలకు ప్రైవేట్ స్కూళ్లు దిక్కయ్యాయి.**

వారు మెల్లగా గ్రామాలకు బస్సులను పెట్టి, మండల కేంద్రాల్లో స్కూళ్లు పెట్టి, అందమైన బొమ్మలు చూపి ముగ్గులోకి దించుతూ వచ్చారు. ఇలాగత దశాబ్దకాలంగా ప్రైవేట్ స్కూళ్ల విజృంభణతో ప్రభుత్వ పాఠశాల లు కనుమరుగు అయ్యాయి. ఉమ్మడి ఎపిలో ఇలా అనేక స్కూళ్లు మూతపడ్డాయి. రాష్ట్ర విభజన తరవాత కూడా పాలకులు ఇదే ధోరణి అవలంబించడంతో అనేక పాఠశాలలు మూతపడ్డాయి. డిఎస్సీల గొడవ, జీతాల గొడవ లాంటివి లేకుండా చేసే కుట్రలో భాగంగా అనేక స్కూళ్లను మూసేశారు. ఘనత వహించిన తెలంగాణలో కెసిఆర్ సర్కార్ ఈ విషయంలో వడివడిగా అడుగులు వేసింది. అందుకే విద్యారంగంలో తీసుకున్న చర్యలు క్షేత్రస్థాయిలో ఎలాంటి ప్రభావం చూపలేదు. పేదలకు విద్య అందించాలన్న ఆలోచన లేకుండా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకున్నాయి. ఇంగ్లీష్ మీడియం ఆశ చూపి స్కూళ్ల విలీనంతో చిన్నపిల్లలు తమ సమీప స్కూళ్లకు వెళ్లే అవకాశం కోల్పోయేలా చేసిన ఘనతను నాటి సిఎం జగన్ సాధించారు. ఒకప్పుడు విద్యను గ్రామస్థాయికి తీసుకుని వెళ్లాలన్న సంకల్పంతో ఏకోపాధ్యాయ పాఠశాలలను ప్రారంభించారు. చిన్న గ్రామానికి కూడా స్కూలు ఉండాలన్న సంకల్పం వచ్చింది. అక్కడ ఒక్కరే టీచర్‌ను నియమించి నడిపించారు. దీంతో అనేక గ్రామాల్లో ఏకోపాధ్యాయ స్కూళ్లు ఏర్పడ్డాయి. తల్లిదండ్రులు తమపిల్లలను ఉన్న ఊర్లోని స్కూలుకు పంపడం వల్ల అక్షరజ్ఞానం వచ్చింది. ఇది అక్షరాస్యతకు తోడ్పడింది. అక్షరాస్యతను పెంచే క్రమంలో ఇదో విప్లవాత్మక చర్యగా చూడాలి. ఈ లక్ష్యం దెబ్బతినకుండా ప్రభుత్వాలు మరింత పకడ్బందీగా విద్యావ్యవస్థను అమలు చేయాల్సింది పోయి వాటిని మూతేశారు. ప్రభుత్వాలు జీతాల భారం తగ్గించుకునే క్రమంలో స్కూళ్ల విలీనం చర్యలకు పూనుకున్నాయి. దీనివల్ల సామాన్యులకు ప్రభుత్వ విద్య దూరం అయ్యింది. ఇది కూడా కార్పోరేట్ కుట్రలో భాగమే అని చెప్పాలి. వారు వెనకవుండి ఆడించిన కారణంగానే ప్రభుత్వాలు ఈ చర్యలకు దిగాయి. ఈ సమస్యను అర్థం చేసుకోకుండా ప్రాథమిక పాఠశాలలను.. ప్రాథమికోన్నత, ఉన్నత విద్యాపాఠశాలల్లో విలీనం చేసారు. గతంలో పాలించిన జగన్ నాయకత్వంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పై విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర నిరసన వ్యక్తం అయ్యింది. మా పాఠశాలను వేరే పాఠశాలలో విలీనం చేయవద్దంటూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చేశారు. నిజానికి ప్రతి గ్రామానికి పాఠశాల ఉండాలన్న సంకల్పం దెబ్బతనికుండా చూడాల్సిన ప్రభుత్వం విలీనం పేరుతో ఇలా చేయడంతో సామాన్యులకు విద్యను దూరం చేశారు. అలాగే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇదే తంతు కొనసాగింది. ఇలా వందలాది పాఠశాలలను మూసివేశారు. ఇదంతా కుట్రపూరితంగా జరిగిన కార్యక్రమంగా గుర్తించాలి. దీంతో ప్రైవేట్ విద్యా సంస్థలు తమ విస్తరణకు అవకాశంగా తీసుకున్నాయి. గ్రామాలకు బస్సులను నడుపుతూ, మండల కేంద్రాల్లో స్కూళ్లను పెడుతూ, వాటిని పెంచుకుంటూ వచ్చారు. దీంతో విధిలేక తల్లిదండ్రులు ఇంటిముందుకు వచ్చే బస్సులో తమ పిల్లలను ప్రైవేట్ స్కూళ్లకు పంపుతున్నారు. దీంతో వారిపై ఆర్థికభారం పడుతోంది. అనివార్యంగా ఇప్పుడు గ్రామాల్లో ప్రజలు తమ పిల్లను ప్రైవేట్ స్కూల్లకు బలిచేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం పెట్టాలన్న సంకల్పం మంచిదే అయినా గ్రామాలకు పాఠశాలలను దూరం చేయడం మాత్రం సరికాదు. ప్రాథమిక పాఠశాలలను విలీనం చేయడం

ద్వారా తమ పిల్లలు బడులకు దూరమవుతారంటూ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్న తీరు ప్రభుత్వం వెంటనే గుర్తించి దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి. సంస్కరణల పేరుతో పాఠశాలలను మూసివేస్తామంటే ఎలాగని గతంలోనే ఎపి హైకోర్టు నిలదీసింది. జాతీయ విద్యావిధానమంటూ విద్యాహక్కు చట్టానికి విరుద్ధంగా పాఠశాలల విలీనం, ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ఎలా చేపడతారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. విద్యాహక్కు చట్టం మేరకు విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తిని పాటిస్తున్నట్లు కనిపించడం లేదని కూడా హైకోర్టు అభిప్రాయ పడింది. ప్రాథమిక విద్య మాతృభాషలోనే ఉండాలని విద్యా హక్కు చట్టం చెబుతోంది. సర్కారు చర్యలు విద్యా వ్యవస్థను బలపరిచేలా ఉండాలే కానీ నిర్వీర్యం చేసేలా ఉండకూడదని పాలకులగుర్తించడం లేదు. నూతన విద్యా విధానం అమలు పేరుతో పాఠశాల విద్య దెబ్బతినకుండా, పిల్లలకు పాఠశాలలు దూరం కాకుండా చూసుకోవాలి. పాఠశాలల విలీనం, ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ద్వారా స్కూళ్ల సంఖ్యను తగ్గించే ప్రయత్నం చేయరాదు. స్కూళ్లను పెంచి, సౌకర్యాలు కల్పించి, టీచర్లను పెంచడం ద్వారా మరింత పటిష్టంగా ప్రభుత్వ విద్య అమలయ్యేలా చూడాలి. ప్రభుత్వ అనాలోచిత చర్య కారణంగా చిన్నారులు, బాలికలు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉంది. విద్యారంగం అన్నది ఏ రాష్ట్రానికైనా ప్రాధాన్యరంగం కావాలి. ఏకోపాధ్యా స్కూళ్లను మరింతగా మెరుగు పరచి ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలి. దీంతో నిరుద్యోగ సమస్యా తీరవచ్చు. ఆర్థికంగా భారమైనా విద్యాయరంగానికి కేటాయింపులు పెంచి అనుత్పాదక రంగాలకు, ఉచితపథకాలకు కోతలు పెట్టాలి. అప్పుడే విద్యారంగం పటిష్టం కావడంతో పాటు..అక్షరాస్యతా ఉద్యమం ముందు సాగగలదు.



# నవ్వే నేరమౌనా?



**మ**నుషులకు సహజసిద్ధమైన మనోల్లాస ప్రకటన నవ్వు. మాటలు రాని పసికందుల మొదలుకొని, వయోవృద్ధుల వరకు అందరూ నవ్వుతారు. నవ్వు ఒక విశ్వజనీన భాష. కొందరు అనునిత్యం చిరునవ్వులు చిందిస్తూ ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటారు. ఇంకొందరు తాము నవ్వుతూ, ఎదుటివారిని కూడా నవ్విస్తుంటారు. అరుదుగా అతితక్కువ మంది ఉంటారు %-% వారు నవ్వరు, ఎదుటివారు ఉల్లాసంగా నవ్వుతూ, ఆనందంగా ఉంటే ఏమాత్రం భరించలేరు. నవ్వేవారు తమను చూసే నవ్వుతున్నారేమోననే భ్రమలోపడి లోలోన కుమిలి కునారిల్లిపోతారు. జీవితంలో నవ్వేరు గని మనుషులను చూసి మిగిలిన లోకం జాలిపడటం తప్ప చేయగలిగిందేమీ లేదు.

నవ్వు ఒక ఆరోగ్య లక్షణం. పసిపిల్లలు బోసినవ్వులు చిందిస్తుంటారు. బాల్యంలో నవ్వే నవ్వుల సంఖ్య వయసు పెరిగిన తర్వాత క్రమంగా తగ్గిపోతుంది. ఎంత ఎదిగినా పెద్దలు కూడా సమయ సందర్భాలను బట్టి నవ్వుతుంటారు. వైద్య పరిశోధనల ప్రకారం పసిపిల్లలు రోజుకు దాదాపు నాలుగు వందల సార్లు నవ్వులొలికిస్తారు. పెద్దలు రోజులో కనీసం ఇరవైసార్లయినా నవ్వుతారు. సంతోషకరమైన జీవితం గడిపేవారు నలభైసార్లకు పైబడి కూడా నవ్వుతారు. 'నవ్వడం ఒక భోగంబీ నవ్వించడం ఒక యోగంబీ నవ్వకపోవడం ఒక రోగం' అన్నారు జంధ్యాల. నవ్వేరుగని రోగులే హాయిగా నవ్వుతూ కనిపించే మనుషులను చూసి కుళ్లుకుంటారు.

'ఒకరిని నవ్వమని శాసించలేముబీ కాని నవ్వవద్దని శాసించినాబీ నవ్వకూడదని భీష్మించుకొని కూర్చొనినా నవ్వు రాక మానదు... అసలు మన నవ్వుకి కొన్ని చోట్ల అర్థం పర్థం లేకపోవటం కూడ కద్దు' అని 'తెలుగు హాస్యం' రచయిత ముట్నూరి సంగమేశం అన్నారు. ఆయన మాటలు అక్షర సత్యం. నవ్వమని ఎవరో శాసిస్తే నవ్వు రాదు. నవ్వొద్దని ఆంక్షలు విధిస్తే, వచ్చే నవ్వు రాకుండా మానదు. 'నవ్వు ఒక దిద్దుబాటు చర్య.

పెడదారి పట్టినవారిని సన్మార్గంలోకి తీసుకురావడానికి, చాదస్తాలను సరిదిద్దడానికి నవ్వు చేయూతనిస్తుంది' అన్నారు ఫ్రెంచ్ తత్త్వవేత్త హెన్రీ బెర్గ్‌సన్. 'నవ్వులేని రోజు దండగ రోజు' అన్నాడు ప్రపంచ ప్రఖ్యాత హాస్యనటుడు చార్లీ చాప్లిన్. 'మానవ జాతి చేతిలో గొప్ప ప్రభావవంతమైన ఆయుధం ఉంది, అదే నవ్వు' అన్నారు అమెరికన్ రచయిత మార్క్ ట్వైన్. నవ్వు అంటే నవ్వులాట కాదు, నవ్వును నిర్వచించడం అంత తేలిక కాదు. నవ్వులోని సంక్లిష్టత నిర్వచనాలకు అందనిది.

'నవ్వవు జంతువుల్ నరుడు నవ్వును, నవ్వులు చిత్తవృత్తికిన్/ దివ్వెలు కొన్ని నవ్వులెటు తేలవు కొన్ని విషప్రయుక్తముల్/ పువ్వులవోలె ప్రేమరసముల్ వెలిగ్రక్కు విశుద్ధమైనవే/ నవ్వులు సర్వ దుఃఖదమంబులు వ్యాధులకున్ మహౌషధుల్' అన్నారు జాషువా. పురాణకాలంలో నవ్వు వల్ల అపార్థాలు, అనర్థాలు వాటిల్లిన సందర్భాలు రెండు ఉన్నాయి.

వాటిలో ఒకటి మహాభారతంలోని పాంచాలి నవ్వు కురుక్షేత్ర సంగ్రామానికి దారితీసిన వైనం తెలిసినదే! మరొకటి రామాయణంలో లక్ష్మణుడి నవ్వు. రాముడి పట్టాభిషేక సమయంలో లక్ష్మణుడికి రెప్పలు మూతబడ్డాయి. పద్నాలు గేళ్ల అరణ్యవాస కాలంలో అన్నాళ్లూ రాని నిద్ర పట్టాభిషేక వేడుక జరుగుతున్నప్పుడే రావాలా అనుకుంటూ లక్ష్మణుడు తనలో తాను నవ్వుకున్నాడు. అతడి నవ్వు సీతారాములు సహా ఆ వేడుకలో కొలువుదీరిన వారందరిలోనూ రకరకాల అపార్థాలకు తావిచ్చింది. పాంచాలి నవ్వు అనర్థాలకు దారితీస్తే, లక్ష్మణుడి నవ్వు అపార్థాలకు దారితీసింది. కేవలం ఈ రెండు ఉదంతాలను ఉదహరిస్తూ, 'నవ్వు నాలుగు విధాల చేటు' అనే నిర్ధారణకు రావడం పూర్తిగా అసమంజసం. నవ్వులలో రకరకాలు ఉన్నాయి. మన ప్రాచీన అలంకారికులు నవ్వులను ఆరు రకాలుగా విభజించారు. అవి: స్మితం, హసితం, విహసితం, ఉపహసితం, అపహసితం, అతిహసితం. నవ్వుకు నానా ప్రయోజనాలు ఉన్నాయి. నవ్వు మానసిక ఒత్తిడిని తగ్గిస్తుందిబీ రోగ నిరోధక శక్తిని పెంచుతుందిబీ గుండె జబ్బులను నివారిస్తుంది. నవ్వు వల్ల ఇన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆధునిక వైద్యశాస్త్రం చెబుతోంది.రాజరికాలు కొనసాగిన కాలంలో రాజులను నవ్వించడానికి విదూషకులు ఉండేవారు. రాజకీయాలతోను, రణతంత్రాలతోను బుర్రలు వేడెక్కిన ప్రభువులకు విదూషకులు తమ హాస్యంతో మనోల్లాసం కలిగించి, వినోదపరచేవారు. పలువురు ఆస్థాన కవులు చమత్కార పద్యాలతో ప్రభువులను నవ్వించేవారు. నేటి ప్రజాస్వామ్యంలోని ప్రభువుల కంటే రాజరికాల నాటి ప్రభువులే హాస్యాన్ని ఆదరించడంలో చాలా నయం అనిపిస్తారు.

నవ్వించే విదూషకులకు, కవులకు వారు నజరానాలు ఇచ్చి, గౌరవించేవారు. హాస్యాన్ని ఆస్వాదించాలంటే కాస్త హాస్యప్రియత్వం, చమత్కారాభిరుచి ఉండాలి. ఆనాటి ప్రభువుల్లో అవి కొంత మెండుగా ఉండేవి. హాస్యం కోసం ఆనాటి కవులు బూతులు కూడా ప్రయోగించేవారు. 'నీతులకేమి ఒకించుక/బూతాడక నవ్వు దొరకు పుట్టదు ధరలో/ నీతులు బూతులు లోక ఖ్యాతులురా' అన్నాడు చౌడప్ప.

ఆనాటి కవులు ప్రభువుల తీరుతెన్నులను, సామాజిక పరిస్థితులను తెగనాడటానికి పదునైన వ్యంగ్యంతో అధిక్షేప పద్యాలు రాశారు. ఆ పద్యాల్లోని వ్యంగ్యం కటువుగా ఉన్నా, నవ్వు తెప్పిస్తుంది. అంతమాత్రాన ఆ ప్రభువులెవరూ ఆ కవులను శిక్షించిన దాఖలాలు లేవు. పాపం, సత్తెకాలం మారాజులు వాళ్లు. మనోభావాల శకం మొదలయ్యాక నవ్వుల వివాదాలు న్యాయస్థానాల ముందుకు వెళుతున్నాయి. నవ్వులను తాళలేని పాలకుల విన్యాసాలు నవ్వులపాలవుతున్నాయి.

# టీచర్ యాదయ్య సహకారంతో
# విద్యార్థులకు మెరుగైన విద్య....





- తల్లితండ్రుల జ్ఞాపకార్థం డిజిటల్ విద్యకు ప్రోత్సాహం.
- విద్యనేర్పిన పాఠశాల ఋణం తీర్చుకుంటున్న దంపతులు.
- దళిత కుటుంబంలో పుట్టి..ఎన్నో సేవలకు ముందడుగు..
- కృతజ్ఞతలు తెలిపిన పిల్లల తల్లితండ్రులు, ఉపాధ్యాయులు.

**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** తాను పుట్టిపెరిగిన గ్రామంలో, విద్యను నేర్పి, ఉన్నత స్థానంలో నిలిపిన పాఠశాలకు, గురువుల ఋణం తీర్చుకునే కార్యక్రమాలు చేస్తున్నారు, రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కోరెంక యాదయ్య... కోరెంక అనేది ఆయన ఇంటి పేరైనప్పటికి, ఉన్నత చదువులు ఆయనను సమాజంలో టీచర్ యాదయ్యగా నిలబెట్టింది. పుట్టింది పేద కుటుంబంలో అయినా..ఆయన పట్టుదల ప్రభుత్వ ఉద్యోగం సాధించడంలో తోడ్పాటయింది. విద్యకు పేద, కుల, మత, వర్గబేధాలు లేవని ఈయనను చూస్తే నిజమనిపిస్తుంది. రాంరెడ్డిపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో, చిన్నప్పటి నుండే విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించాలని ఆయన పూనుకున్నారు. అనుకున్నదే తడవుగా, ఆయన కుమారుల సహకారంతో, ఏఎల్ఎక్స్ ప్రోగ్రాం ప్రారంభించేందుకు ముందుకు వచ్చారు. వాటికోసం అయ్యే ఖర్చును మొత్తాన్ని భరించేందుకు సిద్ధపడ్డారు. వెంటనే తన తల్లితండ్రుల పేరున కంప్యూటర్లు ఇప్పించి అందరికి ఆదర్శంగా నిలిచారు.

**ఎవరీ టీచర్ యాదయ్య..**

మర్రిగూడ మండలం, రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కోరెంక నర్సింహ ఎల్లమ్మలకు యాదయ్య జన్మించాడు. మొదటి నుండే వీరిది పేద కుటుంబ కావడంతో, ఈయనతో పాటు అక్క రాములమ్మ, తమ్ముడు చిన్న యాదయ్యల పోషణ ఆ కుటుంబానికి మరింత భారంగా మారింది. ఒక పూరి గుడిసెలో నివాసం ఉంటూ, ఆయన తల్లిదండ్రులు కూలి పనులు చేసుకునేవారు. పిల్లలను చదివించాలని తల్లిదండ్రులకు కోరిక ఉన్నప్పటికీ, పేదరికం వారిని వెక్కిరించింది. బ్రతుకు బండి నడవాలంటే, ఏదో ఒక పని చేసుకోవాలని.. అదే గ్రామానికి చెందిన పెద్ద వెంకట్ రావు బర్లకాడి జీతగాడిలా మారాడు టీచర్ యాదయ్య. యజమాని చేతిలో దెబ్బలు తిన్న ఆయన జీవితం, విద్యవైపు నడిపించింది. స్కూల్ కు వెళ్ళడానికి బట్టలు లేని సమయంలో, తండ్రి అప్పు చేసి మరి బట్టలు తీసుకున్న రోజులు టీచర్



యాదయ్య మరిచిపోలేదు.రెండో తరగతి రాంరెడ్డిపల్లిలో, ఐదవ తరగతి తానేదార్పల్లిలో చదువుకున్నాడు. ఆదివారం సెలవుల సమయంలో భీమనపల్లిలో మిరప కోయడానికి, గొర్లకాపరిగా మారి, ఎనమిదవ తరగతి వరకు చదువు పూర్తి చేసాడు. ఇదిలా ఉండగా ఏడవ తరగతిలో, తండ్రి మరణం తీరని దుఃఖాన్ని మిగిల్చడమే కాక, విద్యాభ్యాసం అంధకారంగా మారింది. ఎటు వెళ్లలేని సమయంలో చదువుపై ఆయన ఆసక్తి, సరస్వతి వైపు నడిపించింది.

బట్టపోతు నరసమ్మ రామలచ్చయ్యల తోడ్పాటు.

టీచర్ యాదయ్య పెద్దనాన్న కూతురు, బట్టపోతు నరసమ్మ రామలచ్చయ్యలు, ఆపై చదువులకు తోడ్పాటును అందించారు. వారి సొంత గ్రామమైన వెల్మకన్నెకు తీసుకొని వెల్లిన ఆ దంపతులు, వెల్మకన్నె హాస్టల్ లో చేరిపించారు. ఆదివారం వారివద్దే ఉంటూ, వ్యవసాయ పనులు చేసుకుంటూ వారికి సహాయంగా ఉండేవారు టీచర్ యాదయ్య. రుచి లేని, పురుగు పట్టిన అన్నంతో పస్తులు ఉన్న రోజులను, యాదయ్య ఇప్పటికి మరువలేదు. తగిన పోషణ లేక ఆరోగ్యం దెబ్బతినడం సవాళ్ళుగా మారిన రోజుల్లో చదువుకోవాలన్న తపన ఆయనను ఎన్నో కష్టాలను ఎదురుకునే శక్తిని అందించింది. 1987లో ద్వితీయ శ్రేణిలో పదవ తరగతి పూర్తి చేసి, ఇంటర్ చదువులకై, నల్లగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరారు. అక్కడ కూడా కష్టాలు వెంటే వచ్చాయి. రూమ్ కిరాయిలు, తిండి, బట్ట, ఫీజులు, పుస్తకాల కోసమై కూలిగా మారిన రోజులు నెమరేసుకుంటున్నారు యాదయ్య. కిరాణం షాపుల్లో, హెూటల్స్, లాడ్జీలు, ఉప్పరి పనులు చదువుకై వారు చేసిన పనులు పోరాటమనే చెప్పుకోవాలి.

**కన్నతల్లి ఎల్లమ్మ దీవెనతోనే ఉన్నత చదువులు**

తండ్రి లేని యాదయ్యకు తల్లి ఎల్లమ్మనే అంతాతానై చూసుకుంది. దొరల దగ్గర జీతం ఉన్న ఎల్లమ్మ, దొరికిన ప్రతి గింజ, వచ్చిన ప్రతి రూపాయి ఆయన చదుకై వెచ్చించింది. ప్రతి సారి కన్నీళ్లతో కొడుకును సాగనంపే తల్లిపడిన కష్టానికి ఋణం తీర్చుకోవాలని, చదువుపై కసి పెంచుకొని చదవసాగాడు. ఈ సమయంలో ఉపాధ్యాయులు, లెక్చరర్లు ఫీజులు కట్టి ప్రోత్సహించారు. తెలుగు పండిత శిక్షణ పూర్తి చెయ్యడానికి తన వద్ద డబ్బులు లేకపోవడంతో, ఆయన క్లాస్మెట్ అరుణ భారతి ఆర్థిక భరోసాను అందించారు. తనకు ఆయన ఎప్పటికి ఋణపడి ఉంటారనేది చిన్నమాటే. డిగ్రీలో ప్రథమ శ్రేణిలో ఆయన పట్టా పొంది ప్రథమ మెట్టును అధిరోహించారు.

**1996లో ఆయన కళ సాకారం.**

పీజీ ఎంట్రెన్స్ లో ఉస్మానియా పరిధిలో మొదటి ర్యాంక్ సాధించిన ఆయన, పీజిని కొనసాగిస్తూనే ఉపాధ్యాయ పరీక్షలకు హాజరయ్యేవారు. ఆయన పట్టుదల ముందు, ఆశయం తలదించుకుంది. 1996 జులై 18న ఉపాధ్యాయ ఉద్యోగాన్ని సాదించాడు. తాను ఎక్కివచ్చిన పేదరికం మెట్లను, అనుభవాలుగా పేర్చుకొని టీచర్ యాదయ్యగా మారాడు. అప్పటి నుండి ఏదో ఒక రకంగా, తన వద్ద చదువుతున్న విద్యార్థులకు తోచిన సహాయం చేస్తూ, అందరికి సేవలు అందిస్తునే ఉన్నాడు.

### ఆయన బాటలోనే కుటుంబం

టీచర్ యాదయ్య బాటలోనే ఆయన కుటుంబ సభ్యులు నడుస్తున్నారు.. సతీమణి పద్మావతి కూడా ఉపాధ్యాయురాలే.. భర్త యాదయ్యను అనుసరిస్తూ, అందిస్తున్న సహకారాలలో వెన్నంటే ఉన్నారు. పెద్ద కుమారుడు రోహిత్ వర్మ, బెంగుళూరులో కోలికం కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. చిన్న కుమారుడు సిద్దార్థవర్మ ఆస్ట్రేలియాలో, ఎమ్మెస్సి ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు.. కడుపున పుట్టిన పిల్లలు కూడా ఆయన మార్గంలోనే నడుస్తూ, సేవా కార్యక్రమాలు చేస్తూ అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా కోరెంక యాదయ్య మాట్లాడుతూ, మనకు అది లేదు ఇది లేదు అని వెనకడుగు వెయ్యకుండా, పట్టుదలతో పని చేస్తూ, ఏకగ్రతతో సాధిస్తే సాధ్యం కానిది ఏమి లేదని సూచించారు. నేటి యువత చెడు వ్యాసనాలకు బానిస కాకుండా, కన్నతల్లితండ్రులకు, పుట్టిన ఊరికి పేరు తెస్తూ, అందరికి ఆదర్శంగా ఉండాలని సూచించారు.



## ఆదర్శ కాలనీలో దొంత రాజు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

**గండిపేట్(క్రైం మిర్రర్):** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో గణనాథుల పూజలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదర్శ కాలనీలో దొంతరాజు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ కార్పొరేటర్ ప్రేమ్‌దాస్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దొంత రాజు, గంజి రాజు, కాశిగారి యాదగిరి, ఏర్వ సత్యనారాయణ, యంజాల మహేష్ రాజ్, ఏర్వకుమార స్వామి, రాధాకృష్ణ, సిరిసాల నారాయణ, బండారి యాదగిరి, సత్యనారాయణ, ఇంజమూరి శ్రీనివాస్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లుకు ముగ్గువేసి ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: వికారాబాద్ జిల్లా :** కుల్కచర్ల మండల కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే గౌరవనీయులు డాక్టర్ టీ రామ్మోహన్ రెడ్డి ఆదేశాలతో ఇందిరమ్మ ఇండ్లు కుల్కచర్ల అంగడి బజార్ 13 వ వార్డ్ లో ఎండీ మున్ని బేగం ఇందిరమ్మ ఇండ్లుకు ముగ్గ వేసి కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ కన్వీనర్ సుంకిరెడ్డి కృష్ణ రెడ్డి,మాజీ ఎంపీటీసీ ఆనందం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తమ్మలి రాంచెంద్రయ్య, మాజీ ఉప సర్పంచ్ కడుమూరి బాల్ రెడ్డి, మాజీ వార్డ్ మెంబెర్,రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోత్కూర్ వెంకటేష్,రాంరెడ్డి,భైరం లక్ష్మి లింగంగారి రాములు,గుడిసె అంజిలయ్య,భైరం భీమయ్య, యాదయ్య,పాషా,అజామ్, తదితరులు పాల్గొనడం జరిగింది.

## బండ్లగూడ కార్పొరేషన్‌లో జాతీయ క్రీడా దినోత్సవం



గండిపేట్(క్రైం మిర్రర్): బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భారత లెజెండరీ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చందం జయంతి సందర్భంగా శనివారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. మినిస్ట్రీ ఆఫ్ స్పోర్ట్స్ సూచనల మేరకు శనివారం కార్పొరేషన్ పరిధిలో వివిధ ఇండోర్, ఔట్ డోర్ క్రీడలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమిషనర్ శరత్ చంద్ర పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గణనాథుడి పూజల్లో పాల్గొన్న మాజీ కౌన్సిలర్ ఉషారాణి



గండిపేట్(క్రైం మిర్రర్): నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో గణనాథులకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి మాజీ కౌన్సిలర్ ఉషారాణి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో మహిళలు, యువ నాయకులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ గణనాథుడి లడ్డూ రూ.55,116

గండిపేట్(క్రైం మిర్రర్): బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ గంధంగూడ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ప్రతిష్టించిన గణనాథుడి లడ్డూ వేలం పాట నిర్వహించచారు. నవరాత్రుల సందర్భంగా మట్టి విగ్రహాన్ని ప్రాణప్రతిష్ట చేసి ఉదయం, సాయంత్రం ఘనంగా పూజలు కొనసాగాయి. వినాయకుడి షోడశోపచార పూజానంతరం విగ్రమాన్ని కదిలించి లడ్డూ వేలం పాట నిర్వహించారు. మేడిశెట్టి సుధాకర్ గుప్తా, మల్లీశ్వరి వినాయకుడి మొదటి లడ్డూను 55,116 రూపాయలకు కైవసం చేసుకున్నారు. సోమవార్ గిరీష్ అన్నపూర్ణలు 2వ లడ్డూను 33,116 రూపాయలకు కైవసం చేసుకున్నారు. తమ్మిశెట్టి విద్యాసాగర్ ఉమారాణిలు గణపతి దీపపు చెంబెలు వేలం పాటలో రూ.8,116 రూపాయలకు దక్కించుకున్నారు. దేవాలయ ప్రాంగణంలో ఒక కొలను ఏర్పాటు చేసుకోని అందులో నిమర్జనం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించడంతో స్థానిక ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇప్పాయిపల్లి రాంపూర్ గ్రామాల బిజెపి పార్టీ ముఖ్య నాయకుల సమావేశం



క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలోని బిజెపి పార్టీ కార్యాలయంలో శనివారం ఇప్పాయిపల్లి రాంపూర్ గ్రామాల బిజెపి పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు.వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విధి విధానాలపై చర్చించడం జరిగింది.ఈ సందర్భంగా దిశ అడ్వైజర్ కమిటీ మెంబర్ డాక్టర్ జానకిరాం చవాన్,జిల్లా కార్యవర్గ సభ్యులు గాదె మహిపాల్ ముదిరాజ్, మాట్లాడుతూ, నరేంద్ర మోడీ ప్రభుత్వం చేస్తున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇప్పాయిపల్లి, రాంపూర్ గ్రామ పంచాయతీలో బిజెపి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని,రెండు గ్రామలలో బిజెపి పార్టీ జెండాను ఎగరవేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ మాజీ మండల అధ్యక్షులు జెమిని సూర్యకాంత్, స్థానిక సంస్థల కో కన్వీనర్ గాదె మల్లేష్, బిజెపి పార్టీ సీనియర్ నాయకులు మంచమోని రామకృష్ణ, కొత్త వెంకట్రాములు,మెరుగు రాజయ్య, గాదె రామయ్య,చెక్కల లక్ష్మయ్య,చదురుపల్లి బాలకృష్ణయ్య, రాంపూర్ యాదయ్య, వడ్డే చెన్నప్ప,వడ్డెర చంద్రకళ,కావలి.వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు..

క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
6 ఆదివారం 31-8-2025

# కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు లంబాడిలపై అసత్య ప్రచారం చేస్తే సహించేదిలేదు

## లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గోవింద్ నాయక్



**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు లంబాడిలపై అసత్య ప్రచారం చేస్తే సహించేది లేదని వారు తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ తిరిగినా అడ్డుకుంటామని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గోవింద్ నాయక్ హెచ్చరించారు. వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలోని పాలసీతాళికరణ కేంద్రంలో లంబాడి హక్కుల పోరాట సమితి బంజారా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవింద్ నాయక్ మాట్లాడుతూ బంజారా లంబాడిలు సింధు నాగరికత కాలం నుండే ఈ దేశ మూల నివాసులని, భారత దేశ స్వాతంత్రానికి ముందే గిరిజనులుగా గుర్తింపు పొందినామని వారు తెలిపారు. 1871లో బ్రిటిష్ పాలకులు బంజారాలను క్రిమినల్ ట్రైబ్స్ జాబితాలో చేర్చాలని, 1931 లో నిజాం రాజులు చేపట్టిన కులగణన లో బంజారా లంబాడిలను గిరిజనుల పట్టికలో చూపించారని 1956 లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడినప్పుడు ఆంధ్ర ప్రాంతంలోని లంబాడిలు, సుగాలిలను భారత పార్లమెంట్ ఉభయ సభల ఆమోదంతో ద షెడ్యూల్ క్యాస్ట్ అండ్ ద షెడ్యూల్ ట్రైబ్స్ లిస్ట్ ఆర్డర్ – 1956 ప్రకారం గిరిజనులుగా గుర్తింపు పొంది గిరిజన జాబితాలో సీరియల్ నెంబర్ 19 గా చేర్చాబడ్డారని అన్నారు. అయితే ఒకే రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతానికి చెందిన గిరిజన లంబాడిలను సుమారు 25 సంత్సరాలు గిరిజన జాబితాలో చేర్చకపోవడానికి అప్పటి కాంగ్రెస్ పార్టీ లంబాడిలను ఘోరమైన అన్యాయం చేసింది అని అన్నారు. 1969 కే చందా అధ్యక్షతన వేసిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ రిపోర్ట్ ఆధారంగా ఆనాటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ నెత్రుత్వంలో కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ ఉభయ సభ ల ఆమోదంతో ద షెడ్యూల్ క్యాస్ట్ అండ్ ద షెడ్యూల్ ట్రైబ్స్ (సవరణ) యాక్ట్ 1976 (యాక్ట్ %అశీ 108 శీట%1976)తేదీ :సెప్టెంబర్ 19, 1976 చట్టం చేసి తెలంగాణ ప్రాంతానికి చెందిన లంబాడిలను గిరిజన జాబితాలో క్రమ సంఖ్య 29 గలో చేర్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డీ గత శాసన సభ ఎన్నికల్లో లంబాడిల ఓట్లతోనే కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందని అనేక సభలలో ప్రకటించారు. కానీ 2017 లో ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు ప్రాంతంలో హింసత్మక ఘటనకు పాల్పడిన సోయం బాబురావు, తెల్లం వెంకట్రావు లను కాంగ్రెస్ పార్టీ లోకి చేర్చుకున్నారు. తేదీ 24/07/2025 నా వీరిద్దరూ లంబాడిలను గిరిజన జాబితా నుండి తొలగించాలని రిట్ ఫిటిషన్ దాఖాలు చేశారు. ఇది కాంగ్రెస్ పార్టీ ఆదేశాల ప్రకారమే జరిగిందా..? దీనికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డీ పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ లంబాడిలకు సమాధానం చెప్పాలన్నారు. దీనిపై బిఆర్ఎస్, బీజేపీ ల వైఖరి కూడా ఎటువైపో..? సమాధానం చెప్పాలి అని అన్నారు. ఈ కార్యక్రంలో బంజారా హక్కుల సాధన సమితి వ్యవస్థపాక అధ్యక్షులు వినోద్ నాయక్, ఉపాధ్యక్షులు వీరేందర్ నాయక్, ఎల్ హెచ్ పిఎస్ వికారాబాద్ జిల్లా కార్యదర్శి కేతావత్ రవీందర్ నాయక్, పరిగి తాలూకా అధ్యక్షులు అంగోత్ సేవ్యా నాయక్, కుల్కచర్ల మండల ఎల్ హెచ్ పిఎస్ నాయకులు శంకర్ నాయక్, చందు నాయక్, దోమ మండల ఎల్ హెచ్ పిఎస్ నాయకులు సేవ్యా నాయక్ మూడవత్ రవీందర్ నాయక్, పాండు నాయక్, చందర్ నాయక్, బాలు నాయక్, ఆకాష్, తదితరులు పాల్గొన్నారు.



## మణికొండ మున్సిపాలిటీలో గణనాథుడి పూజల్లో పాల్గొన్న గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్

**గండిపేట్(క్రైం మిర్రర్):** మణికొండ మున్సిపాలిటీ పరిధిలో గణనాథులకు పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. పలు కాలనీలలో వినాయక మండపాలలో కొలువైన గణనాథుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ పూజల్లో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్, మాజీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, నార్సింగి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ శ్రీరాములు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏర్పుల కుమార్, నాయకులు శ్రావణ్‌కుమార్, గంగాధర్, సంతోష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్, ఆయా నియామకం కోసం ధరఖాస్తుల ఆహ్వానం

### గండిపేట మండల విద్యాధికారి కె.సునీల్‌కుమార్



గండిపేట్(క్రైం మిర్రర్): గండిపేట మండలంలో గల ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా అందరికీ మరింత నాణ్యమైన విద్య అందించే క్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నుకోబడిన కొన్ని పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించబడుతుందని మండల విద్యాధికారి కె.సునీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గండిపేట మండలంలో రెండు పాఠశాలు కిస్మత్‌పూర్ ఎంపీపీఎస్, కోకాపేట్ ఎంపీపీఎస్‌లో ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించబోతున్నామని తెలిపారు. నాలుగు సంవత్సరాలు, ఆపై వయస్సు ఉన్నటువంటి విద్యార్థినివిద్యార్థులు అందరూ ఈ తరగతులలో ప్రవేశం పొందడానికి అర్హులన్నారు. ప్రతి పాఠశాలలో ఒక ప్రీ ప్రైమరీ ఇన్స్రక్టర్(ఇంటర్ అర్హత), ఒక ఆయా(7వ తరగతి) నియామకం కోసం స్థానిక అభ్యర్థులు తేదీ 30వ తేదీ నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు అర్హత గల స్థానిక మహిళ అభ్యర్థులచే ధరఖాస్తులను మండల విద్యావనరుల కేంద్రం గండిపేట్ కిస్మత్‌పూర్‌లో స్వీకరించబడుతుందన్నారు.

## భక్తిశ్రద్ధలతో పూజలందుకుంటున్న గణనాథులు

### మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కొండకళ్ల నరేందర్‌రెడ్డి



గండిపేట్(క్రైం మిర్రర్): మణికొండ మున్సిపాలిటీ పరిధిలో గణనాథుడికి పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గణేష్ మండపాలను సందర్శించి వినాయకుని ఆశీస్సులు తీసుకోవడం జరుగుతుంది. మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కొండకళ్ల నరేందర్‌రెడ్డి గణేష్ నవరాత్రులలో భక్తులందరూ పాల్గొనడం ఎంతో శుభసూచకమని సనాతన ధర్మానికి ఆదర్శమని హింధువులందరూ చిన్న పెద్ద అని భేదం లేకుండా ఎంతో సంతోషంగా జరుపుకునే పండుగ సమాజంలో అందరూ కలిసిమెలిసి ఉండేందుకు ఐకమత్యంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ పూజల్లో మాజీ కోఆప్షన్ సభ్యులు జి.సిద్ధప్ప, రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు చిలుకూరి బీరప్ప, మణికొండ మున్సిపాలిటీ బీజేపీ పార్టీ అధ్యక్షులు బి.రవికాంత్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వెంకటాచారి, మాజీ ఎంపీటీసీ ఎం.రాఘవరెడ్డి, పోచమ్మ కాలనీ అధ్యక్షులు గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్, రామకృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్ కావ్య శ్రీరాములు, శైలజ, శ్రావణ్, గంగాధర్, మాజీ కోఆప్షన్ సభ్యులు జయలక్ష్మి, కాలనీ కమిటీ మెంబర్స్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## గుంత తీశారు.. యాది మరిచారు.. ఎవరిది నిర్లక్ష్యం...!

### ఇబ్బందులు పడుతున్న ప్రజలు..ప్రమాదాలు జరుగుతున్న పట్టింపు లేదు

### పట్టించుకొని సంబంధిత అధికారులు

**మునుగోడు (క్రైమ్ మిర్రర్ ప్రతినిధి) :** గుంత తీసి యాది మరిచిన సంఘటన మునుగోడు గ్రామ పంచాయతీ పరిధిలో చోటు చేసుకుంది. గ్రామ పంచాయతీ పరిధిలోని బట్లకాల్వ నుండి లక్ష్మీదేవిగూడెం వెళ్ళే దారిలో విద్యుత్ అధికారులు (కాంట్రాక్టర్ సిబ్బంది) విద్యుత్ స్థంబాలు వేయడానికి పలు చోట్ల సుమారు 15 రోజుల క్రితం గుంతలు తీస్తున్న సమయములో నీటి పైపులు పలిగి పోవడం జరిగింది..ఏర్పడ్డ గుంతలతో వాహనదారులు ,ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు మార్లు తిరిగిన పట్టించుకునే నాధుడే కరువయ్యారాని ప్రజలు వాపోతున్నారు..సంబంధిత అధికారులు సమస్యను పరిశీలించి వెంటనే ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రమాదాల బారిన పడకుండా పరిష్కరించాలని ప్రజలు అధికారులకు విన్నవిస్తున్నారు..

## ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు

### రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్



గండిపేట్(క్రైం మిర్రర్): ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేదిశగా, అందరికీ నాణ్యమైన విద్య అందించే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నుకోబడిన కొన్ని పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభిస్తుందని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ ఒక ప్రటనలో తెలిపారు. ఇందులో భాగంగా రాజేంద్రనగర్ మండలంలో ఎంపిక చేసిన శివరాంపల్లి, రాజేంద్రనగర్, అత్తాపూర్, వాంబే కాలనీ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించబోతున్నామన్నారు. నాలుగు ఏళ్లు, ఆపై వయస్సు కలిగిన విద్యార్థులకు ప్రీ ప్రైమరీలో ప్రవేశానికి అర్హులన్నారు. ప్రతి పాఠశాలలో ఒక ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఒక ఆయాను నియామకానికి ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు మహిళా అభ్యర్థుల నుంచి ధరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. రాజేంద్రనగర్ మండల విద్యా కార్యాలయంలో స్వయంగా ధరఖాస్తులను సమర్పించాలన్నారు. మరింత సమాచారం కోసం ఎంఈవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## బిజెపి పార్టీ కుల్కచర్ల మండల స్థానిక సంస్థల కో కన్వీనర్ గా గాదే.మల్లేష్

### నియామక పత్రాన్ని అందించిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం ప్రహ్లాద రావు



క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల బిజెపి పార్టీ మండల స్థానిక సంస్థల కో కన్వీనర్ ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన బిజెపి పార్టీ సీనియర్ నాయకులు గాదే.మల్లేష్ ను నియమించారు. బిజెపి పార్టీ మండల అధ్యక్షులు గుడాల వెంకటేష్ ఆధ్వర్యంలో శుక్రవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం ప్రహ్లాద్ రావు దిశా అడ్వైసర్ కమిటీ మెంబర్ డాక్టర్ జానకిరాం చవాన్ మల్లేష్ ను సన్మానించి నియామకా పత్రాని అందించారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ నా మీద ఉన్న నమ్మకంతో బిజెపి పార్టీ మండల స్థానిక సంస్థల కో కన్వీనర్ నియమించిన బిజెపి పార్టీ సీనియర్ నాయకులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం ప్రహ్లాద రావు అన్నకు బిజెపి పార్టీ మండల నాయకులకు ప్రత్యేకమైన ధన్యవాదములు తెలియజేశారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బిజెపి పార్టికి గెలుపే లక్ష్యంగా మండల నాయకులతో కలిసి ఎల్లప్పుడు పని చేస్తానని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు గాదే మహిపాల్ ముదిరాజ్, మండల ఉపాధ్యక్షులు కుండా ఆంజనేయులు, బిజెపి పార్టీ మైనారిటీ మోర్చా నాయకులు ఎండి రజక్ పాష, వెన్నచెడు వెంకటేష్ మల్లేష్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం







గండిపేట్(క్రైం మిర్రర్): క్రీడల ద్వారా శరీర ధారుఢ్యం, మానసిక ఉల్లాసం కలుగుతాయని రాజేంద్రనగర్ జోన్ డీసీపీ శ్రీనివాస్ అన్నారు. రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడల ప్రాముఖ్యత, శారీరక ఆరోగ్యం, క్రమ శిక్షణ, జట్టు భావన, విద్యార్థి జీవనంలో క్రీడలు కలిగించే విలువల గురించి వివరించారు. చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వివిధ క్రీడా పోటీలు, ఆటలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ గోవర్ధళన్, ఓఎస్ఏ రామ్‌రెడ్డి, క్రీడల ఇంచార్జ్ సైదా నాయక్, ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

# అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది.. అన్నం పరబ్రహ్మ స్వరూపం..

## చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తుల విప్లవ్ కుమార్ గౌడ్





**చౌటుప్పల్, ఆగస్టు 30, (క్రైమ్ మిర్రర్):** అన్ని దానాల కన్నా అన్నదానం చాలా గొప్పదని చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తుల విప్లవ్ కుమార్ గౌడ్ అన్నారు. శనివారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్టించిన గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని అన్నదాతలైన బత్తుల లక్ష్మయ్య - వరలక్ష్మి దంపతులు, బత్తుల విప్లవ్ గౌడ్ - వాణి దంపతులు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... హిందూ ధర్మంలో ఆకలితో ఉన్న జీవికి ఆహారం ఇవ్వడం కంటే మంచి పూజ గానీ మరొక ఆచారం లేదని భావన. అన్నదానం అనేది మహాదానం., అన్నం అంటే ఆహారం, 'దానం' అంటే ఇవ్వడం లేదా దానం చేయడం. అన్నదానాన్ని వివిధ రకాల దానంలో 'మహాదానం' అంటారు. హిందూ పురాణాల ప్రకారం, దానాల్లో ఉత్తమమైన దానం అన్నదానమని అన్నారు. ఆకలితో ఉండే వారికి, కడుపు నిండా భోజనం పెట్టటం కంటే, తృప్తి ఏమి ఉంటుందని అన్నారు. గణపతి నవరాత్రుల సందర్భంగా అన్నదానం చేయడం నా పూర్వజన్మ సుకృతం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ కనకటి యాదగిరి, గౌడ సంఘం నాయకులు అంజయ్య గౌడ్, బత్తుల శ్రీశైలం గౌడ్, సుర్వి నరసింహ గౌడ్, మోగుదాల రమేష్ గౌడ్, బొంగు జంగయ్య గౌడ్, ఉష్కాగుల రమేష్ గౌడ్, ఉడుగు శ్రీనివాస్ గౌడ్, మునుకుంట్ల సత్యనారాయణ గౌడ్, వర్కాల రవి గౌడ్, సందగళ్ళ సతీష్ గౌడ్, ఉడుగు రమేష్ గౌడ్, ఉడుగు నరసింహ గౌడ్, చెరుకు లింగస్వామి గౌడ్, తొర్పునూరి రవి గౌడ్, తొర్పునూరి లింగస్వామి గౌడ్, మామిడి శివ, చెవగోని మహేష్ గౌడ్, కళ్ళెం నాగరాజు గౌడ్, గౌడ కుల బాంధవులు, ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పుప్పాలగూడ స్కైలా గేటెడ్ కమ్యూనిటీలో కరెన్సీతో గణనాథుడికి అలంకరణ



**గండిపేట్(క్రైం మిర్రర్):** మణికొండ మున్సిపాలిటీ పుప్పాలగూడ వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. పుప్పాలగూడలోని స్కైలా గేటెడ్ కమ్యూనిటీలో గణనాథున్ని కరెన్సీతో అలంకరించారు. ఈ కరెన్సీ గణపతి భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది.

## ఉస్మాన్ పుర ఎన్ సి ఎల్ పి అంగన్వాడీ కేంద్రంలో ఈసీసీఈ డే సెలబ్రేషన్స్...!



జగిత్యాల జిల్లా ప్రతినిధి (క్రైమ్ మిర్రర్): పూర్వ ప్రాథమిక విద్య యొక్క ఆవశ్యకతను తెలుపుటకు ప్రతి అంగన్వాడీ కేంద్రంలో ప్రతి నెల నాలుగవ శనివారం "ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ డే" నిర్వహించడం జరుగుతుంది. ఇందులో భాగంగా ఉస్మాన్పుర ఎన్సీఎల్పీ అంగన్వాడి కేంద్రంలో ప్రీ స్కూల్ పిల్లల తల్లులతో ఈసీసీ ఈడే కార్యక్రమాన్ని నిర్వహించుకున్నాము ఈ కార్యక్రమంలో సిడిపిఓ మమతా మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా పిల్లలు అన్ని విషయాలలో ముందంజలో ఉన్నారని తెలిపినారు. మంచి అలవాట్లు, సంభాషణ,కథ,పాటలు, శాస్త్రీయ పరిజ్ఞానము,సృజనాత్మకత ప్రతి ఒక్క పిల్లవానిలో పెంపొందించుటకు ప్రీ స్కూల్ కారిక్యులం ప్రతి అంగన్వాడి కేంద్రానికి ఇచ్చారు.దాని ప్రకారం పిల్లలు మంచి అలవాట్లు నేర్చుకుంటున్నారు థాంక్యూ చెప్పడం, చెప్పులు వరుసలో పెట్టుకోవడం, మరుగుదొడ్డి ఉపయోగించడం, రుమాలు ఉపయోగించడం వంటివన్నీ పిల్లలు చేస్తున్నారు మరియు ఆటల ద్వారా పిల్లల్లో చిన్న కండరాలు మరియు పెద్ద కండరాలు అభివృద్ధి చెందుతాయి అని తెలిపినారు. కథల ద్వారా పిల్లల్లో ఆలోచన శక్తి పెరుగుతుంది అని, శాస్త్రీయపరిజ్ఞానం ద్వారా పిల్లల్లో మీదో శక్తి అభివృద్ధి చెందుతుందని తల్లులకు తెలిపినారు ఈ కార్యక్రమంలో తల్లులు తమ యొక్క పిల్లలు అంగన్వాడీ కేంద్రానికి వచ్చినప్పటి నుంచి చాలా చురుకుగా ఉన్నారని అన్ని విషయాలు మాట్లాడుతున్నారని తల్లి దండ్రులువాళ్ల ఫీడ్ బ్యాక్ వివరించారు ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ స్వరూపారాణి, ప్రీస్కూల్ పిల్లలు, తల్లులు, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు

## "ఘనమైన గణపయ్య పూజలో అన్నదాన కార్యక్రమం"







హైదరాబాద్ జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 5 పరిధిలో. గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గణేష్ పూజలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆ గణనాథుని ఆశీస్సులు ఎల్లప్పుడు మా సంస్థపై మరియు మా కుటుంబ సభ్యులపై ఆ విగ్నేష్ ఆశీస్సులు ఉండాలని పూజలో పాల్గొన్న. సురేష్, సంతోష్, తారక్ రాజశేఖర్, మరియు సంస్థ ఉద్యోగులు.

## రాజకీయ నాయకులతో సమీక్ష

### ఎంపీడీఓ బి.సందీప్ కుమార్



చౌటుప్పల్, ఆగస్టు 30, (క్రైమ్ మిర్రర్): యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ బి.సందీప్ కుమార్ ఆధ్వర్యంలో మండల స్థాయి రాజకీయ నాయకులతో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సర్పంచ్, వార్డ్ సభ్యుల పోలింగ్ స్టేషన్ల, ఓటర్ల జాబితాపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో బి ఆర్ ఎస్ మండల అధ్యక్షులు గిర్కటి నిరంజన్ గౌడ్, బిజెపి పార్టీ మండల అధ్యక్షులు కైరంకొండ అశోక్ నేత, బి.ఎస్.పి. పార్టీ మండల అధ్యక్షులు తగరం సుభాష్, ఇతర ప్రతినిధులు, ఎమ్ పి ఓ వి అంజిరెడ్డి లు పాల్గొన్నట్లు తెలిపారు.

## మహా విఘ్నేశ్వరుని పూజలో పాల్గొన్న జన నేత కేఎల్ఆర్

### సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికిన కాంగ్రెస్ శ్రేణులు



**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్ పేట్, బడంగ్ పేట్ మున్సిపాలిటీలలో పర్యటించిన కి ఎల్ ఆర్.బడంగ్ పేట విఘ్నేశ్వరుడు,అల్మాస్ గూడ, లంబోధరుడు,నందిహిల్స్ బొజ్జ గణపయ్యాను మీర్పేట్ లో వక్రతుండికి పూజ జిల్లెలగూడ ఏకదంతుడి రూపంలో కొలువుదీరిన మహా గణనాథుడి దర్శించుకుని ప్రత్యేక పూజలలో పాల్గొన్న మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి.పాల్గొన్నారు.ఈ సందర్భంగా నందిహిల్స్ లో మాజీ కార్పొరేటర్ ముద్ద పవన్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు.కాలనీవాసులతో సంప్రదాయ సన్నాయి,మంగళ వాయిద్యాలు,బోనాలతో ఆడపడుచులు కె ఎల్ ఆర్ కు ఆత్మీయ స్వాగతం పలికారు.ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ... మీర్పేట్ కార్పొరేషన్ శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మౌలిక వసతులు కల్పించి కాలనీలను అన్నీ విధాలా అభివృద్ధి చేస్తామని లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,టిపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి,జిల్లా నాయకులు మండల నాయకులు కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ ఎస్ యూ ఐ నాయకులు,మహిళా నాయకురాలు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం



**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** శంకర్‌పల్లి లో ఆదివారం నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు భక్తి,శ్రద్ధలతో లంబోధరుడుకి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో..

## " భక్తిశ్రద్ధలతో గణనాథుని పూజలు "



హైదరాబాద్:- అల్లాపూర్ డివిజన్ వివేకానంద నగర్ రోడ్ నెంబర్ 5 లో. బాల గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో. మూడో రోజు ఆ గణనాథుని ఘనంగా పూజలు నిర్వహించారు. గణేష్ పూజలో పాల్గొన్న దంపతులు. పేరబోయిన గోపి కుమార్ సుజాత, మరియు దయారం దేవసి, బద్లీ దేవి కుటుంబ సభ్యులు ఆ విగ్నేశ్వర పూజలో పాల్గొన్నారు.

## మట్టి వినాయకుడి నీ నిమజ్జనం చేసిన చిన్నారి

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి:** వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 3వ రోజు శంకర్ పల్లి మునిసిపల్ లో వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ఫతేపూర్ మూసి వాగు వద్ద వన్షిక అనే చిన్నారి మట్టి వినాయకున్ని నిమజ్జనం చేసింది



క్రైమ్ THE మిర్రర్ ®
Voice of Anti Corruption
విలేకరులు కావలెను
క్రైమ్ మిర్రర్ తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు,
నియోజకవర్గం, మండలాలవారీగా
అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు ఈ క్రింది
నెంబరుకు సంప్రదించగలరు.
9393446188

# రామగుండం పోలీస్ కమిషనరేట్ లో ఘనంగా అన్నదాన కార్యక్రమం



## చిన్నపిల్లలకు స్వయంగా అన్నం వడ్డీంచిన సీపీ ..

పెద్దపల్లి క్రైమ్ మిర్రర్ ఆగస్టు 30 న్యూస్ : రామగుండం పోలీస్ కమిషనరేట్ హెడ్ క్వార్టర్స్ లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమం కు పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్, పెద్దపల్లి డీసీపీ కరుణాకర్ లతో కలిసి పాల్గొని సీపీ గారు స్వయంగా %వీణఎబౌ%( మంథని డివిజన్ హ్యాండ్ క్యాఫ్డ్ వెల్ఫేర్ సొసైటీ), బాలల సంరక్షణ ఆశ్రమం, గోదావరిఖని, లోని పిల్లలకి భోజనం వడ్డీంచి వారితో కలిసి అధికారులు భోజనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసిపి ఎం. రమేష్ బెల్లంపల్లి ఏసిపి రవి కుమార్ , జైపూర్ ఎసిపి వెంకటేశ్వర్లు, పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ, మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, ఏఓ శ్రీనివాస్, వివిధ విభాగల ఇన్స్పెక్టర్ లు, ఆర్ఐలు దామోదర్, శ్రీనివాస్, శేఖర్,మల్లేశం, ఆర్ఎస్ఐ లు, స్పెషల్ పార్టీ సిబ్బంది, ఏఆర్ సిబ్బంది, సీపీఓ, వివిధ పాల్గొన్నారు.

## కొత్త స్థానంలో నూతన ఉత్సాహంతో పని చేసి వంద శాతం లక్ష్యాలను సాధించాలి: స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ



### విజయవంతంగా జరిగిన 148 సెర్ప్ ఉద్యోగుల బదిలీ

### సెర్ప్ ఉద్యోగుల బదిలీ కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్

ఖమ్మం(క్రైమ్ మిర్రర్ ప్రతినిధి): కొత్త స్థానంలో నూతన ఉత్సాహంతో పని చేసి వంద శాతం లక్ష్యాలను సాధించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, స్థానిక టి.టి.డి.సి. భవనంలో శనివారం జరిగిన సెర్ప్ ఉద్యోగుల బదిలీ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ సెర్ప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి మార్గదర్శకాలు, జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఖమ్మం జిల్లాలో సెర్ప్ ఉద్యోగుల బదిలీలు విజయవంతంగా పూర్తి చేసామని అన్నారు. జిల్లాలో 94 మంది యల్ 2, పది మంది యల్ 1, 44 మంది యం.యస్.సి.సి మొత్తం 148 మంది సెర్ప్ ఉద్యోగులను వారు కోరుకున్న స్థానంలో సీనియారిటీ బట్టి కౌన్సిలింగ్ ద్వారా బదిలీ చేయడం జరిగిందని అన్నారు.సెర్ప్ ఉద్యోగులు నూతన స్థానంలో ఉత్సాహంతో పనిచేసి వారికి కేటాయించిన లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎన్. సన్యాసయ్య, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారిణి ఆర్. జయశ్రీ, డిపిఎం, ఏపీఎంలు, సెర్ప్ ఉద్యోగులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.జిల్లా పౌరసంబంధాల అధికారి కార్యాలయం, ఖమ్మంచే జారీ చేయనైనది.

# మాగంటి గోపీనాథ్ ప్రజల మనిషి

### ఆయన కుటుంబానికి అండగా ఉంటాం

### సంతాప చర్చలో కెటిఆర్ వెల్లడి



హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): జీవించినంత కాలం మాగంటి గోపీనాథ్ మాస్ లీడర్, డైనమిక్ లీడర్‌గా పని చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. శాసనసభలో మాగంటి గోపీనాథ్ సంతాప తీర్మానం సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. ఈ సభలో సోదరుడు, సహచరుడు, హైదరాబాద్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గోపీనాథ్ సంతాప తీర్మానం ప్రవేశపెట్టాల్సి వస్తదని కలలో కూడా అనుకోలేదు. జీవించి ఉన్నంతకాలం ఆయన అనారోగ్యం గురించి చెప్పుకోలేదు. గుమ్మనంగా ఉంటూ తన వ్యక్తిగతమైన ఆరోగ్య విషయాలను చాలా రహస్యంగా ఉంచారు. కానీ పబ్లిక్ పరంగా చాలా యాక్టివ్‌గా ఉండేవారు. హైదరాబాద్ నగరంలో జూబ్లీహిల్స్ అంటేనే సంపన్నులు నివసించే ప్రాంతం అని పేరు. కానీ అక్కడ ఉండేది మొత్తం పేద ప్రజలు. బస్తీలతో కూడిన ఏరియా. అలాంటి ఏరియాను మాగంటి గోపీనాథ్ ఎంతో అభివృద్ధి చేశారని కేటీఆర్ కొనియాడారు. హైదరాబాద్‌లోని హైదర్‌గూడలో గోపీనాథ్ జన్మించారు. ఇక్కడే చదవుకుని ఉస్మానియాలో డిగ్రీ చేశారు. ఎన్టీఆర్‌కు వీరాభిమానికిగా టీడీపీలో అడుగుపెట్టారు. బషీర్‌బాగ్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్ నివాసం ఉండేది మేం. ప్రస్తుతం ఉన్న అమర జ్యోతి ముందు ఓ కటౌట్ కనబడేది.. నిలువెత్తు కృష్ణుడు, రాముడు రూపంలో ఎన్టీఆర్ కటౌట్ ఉండేది.. దాని కింద మాగంటి గోపీనాథ్ అని రాసి ఉండేది. అప్పటు÷-నంచే తనకంటూ ఒక ప్రత్యేకత సంపాదించుకున్నారు గోపీనాథ్ అని కేటీఆర్ తెలిపారు. విద్యార్థి దశ నుంచి క్రియాశీలంగా రాజకీయాల్లో ఉన్నారు గోపీనాథ్. ఒక పార్టీని, నాయకుడిని నమ్ముకుంటే.. ఎన్టీఆర్ నాయకత్వంలో.. కేసీఆర్ నాయకత్వంలో కష్టమొచ్చినా నష్టమొచ్చినా పని చేశారు. ఎమ్మెల్యేగా సేవలందించారు. హ్యాట్రిక్ కొట్టడం ఎమ్మెల్యేలకు అంత సులువు కాదు. అది గోపీనాథ్‌కు సాధ్యమైంది. మాదాపూర్ ఏరియాలో చాలా చిన్న ఇంట్లో గోపీనాథ్ నివాసం ఉన్నారు. గోపీనాథ్ ఎప్పుడూ కూడా గుమ్మనంగా ఉండేవారు. ముగ్గురు పిల్లలు 21 ఏండ్ల లోపే. ఎవరూ సెటిల్ కాలేదు పెళ్లిల్లు కాలేదు. ఆయన ఇల్లు చూసి బాధపడ్డాం. బతుకమ్మ చీరలను ప్రారంభించే కంటే ముందు.. తన నియోజకవర్గంలో బతుకమ్మ పండుగకు చీర పెట్టే సంస్కృతి తీసుకొచ్చారు గోపీనాథ్. నియోజకవర్గంలో గోపన్న అని పిలుచుకుంటారు. ప్రజలతో నిత్యం మమేకమయ్యేవారు గోపీనాథ్ అని కేటీఆర్ గుర్తు చేశారు.ఎస్పీఆర్ హిల్స్‌లో ఓ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తే.. దాన్ని అడ్డుకుని పిల్లలకు గ్రౌండ్‌గా తీర్చిదిద్దారు. బతుకమ్మ వేడుకలు, రంజాన్, క్రిస్మస్ వేడుకలను ఆ గ్రౌండ్‌లో నిర్వహించారు. బతికినంత కాలం మాస్ లీడర్‌గా డైనమిక్‌గా ఉన్నారు. స్పందించే గుణం ఎక్కువ గోపీనాథ్‌కు. కేసీఆర్‌కు నమ్మిన విధేయుడిగా పని చేశారు. ఆయన మరణం పార్టీకి, జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి తీరని లోటు-. గోపీనాథ్ కుటుంబానికి మా పార్టీ పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు.




## వొల్లాల భాగ్యలక్ష్మి మిస్సింగ్ కేస్ చేదించిన మహాదేవపూర్ పోలీసులు

### వివరాలు వెల్లడించిన మహాదేవపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు

క్రైమ్ మిర్రర్, మహాదేవ్ పూర్ ప్రతినిధి: మహాదేవపూర్ మండలం అంబటిపల్లి గ్రామానికి చెందిన వొల్లాల భాగ్యలక్ష్మి (51) గత సంవత్సరం డిసెంబర్ నుంచి కనబడకుండా పోయింది, తన కుమారుడు వొల్లాల రవికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మహాదేవపూర్ పోలీసులు ఎట్టకేలకు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ కి పంపించారు. వివరాలోకి వెళితే..భర్త చనిపోయి కుమారుడితో బ్రతుకుతున్న భాగ్యలక్ష్మి వద్ద డబ్బులు ఉన్నవి గమనించిన వెన్నపురెడ్డి రామయ్య మహిళను మాయ మాటలతో నమ్మించి భూపాలపల్లి దగ్గర గల కమలాపూర్ ఎక్స్ రోడ్ నుంచి కొద్ది దూరంలో ఉన్న అడవిలోకి తీసుకెళ్లి హత్య చేసి ఆదరము లేకుండా మహిళ యొక్క శవాన్ని పెట్రోల్ పోసి తగలబెట్టి తప్పించుకుని తిరుగుతున్నడు. హత్య అనంతరం అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్న పోలీసులు సెల్ ఫోన్ సిగ్నల్స్ కాల్ డేటా సిసి కెమెరాలు క్షుణ్ణంగా పరిశీలించిన పోలీసులు ఎట్టకేలకు శుక్రవారం నిందితుడిని అరెస్టు చేశారు ఈ సందర్భంగా సిఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేరం చేసి తప్పించుకునే ఏ వ్యక్తికైనా చట్ట ప్రకారం శిక్ష తప్పదని, నేరం చేయాలనే ఆలోచన వచ్చిన పోలీస్ వ్యవస్థ నుంచి తప్పించుకోవడం సాధ్యం కాదని హెచ్చరించారు.

### వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా

## దైవనామ కీర్తనలలో 'అమరేశ్వర ఆలయం'



క్రైమ్ మిర్రర్, మహాదేవ్ పూర్ ప్రతినిధి: మహాదేవపూర్ మండలం అంబటిపల్లి గ్రామంలోని అమరేశ్వర ఆలయంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామస్తులంతా కలిసి భజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. అమరేశ్వర భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ భజన కార్యక్రమంలో భక్తులు ఒకచోట చేరి భగవంతుడిని స్మరిస్తూ, శ్రవణం, మననం, కీర్తనం వంటి పద్ధతుల ద్వారా ఆధ్యాత్మిక పురోగతిని సాధిస్తూ కీర్తనలు చేస్తున్నారు. భజన కార్యక్రమాలు ప్రజల్లో భక్తిని పెంపొందించడానికి మరియు ఆధ్యాత్మిక పరంగా ఎంతో ఆనందాన్ని కలిగించడానికి దోహద పడుతుంది.

## త్రిశూల్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో వెయ్యి దీపోత్సవం

### ఉత్సవాలలో భాగంగా అలరించిన కూచిపూడి నృత్యాలు

మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్): శ్రీ వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా తుక్కుగూడ మున్సిపాలిటి, రావిర్యాలలో రావిర్యాల్ కా రాజా త్రిశూల్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో వెయ్యి దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.మహిళలు చిన్నారులు పాల్గొని విఘ్నేశ్వరుని సన్నిధిలో వెయ్యి దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు.విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శ్రీ వారాహి కూచిపూడి డాన్స్ అకాడమీ డా జాహ్నవి రెడ్డి ఆధ్వర్యంలో చిన్నారులచే భక్తిపాటలతో కూచిపూడి నృత్యాలు నిర్వహించారు.చిన్నారుల వృత్యాలు చేస్తున్నప్పుడు చప్పట్లతో మారుమ్రోగిన విఘ్నేశ్వరుని సన్నిధి.త్రిశూల్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు చిన్నారి కళాకారులకు బహుమతులు ప్రధానం చేసి అభినందించారు.







## పహాడీ షరీఫ్ ప్రధాన రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న మహాకాళి ప్రతిమ

### తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు,పట్టించుకొని అధికారులు

మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్): పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్ సమీపంలో తుక్కుగూడ నుండి హైదరాబాద్ వెళ్ళే ప్రధాన రొడ్డు దేవేంద్ర నగర్ సమీపంలో గత వారం రోజుల నుండి మహాకాళి విగ్రహం.రోడ్డులో ప్రమాదకరంగా ఉండడం వలన హైదరాబాద్ వెళ్ళే వాహన దారులు ఇబ్బందులు ఎదుర్కున్నారు. కాళి ప్రతిమను తీసుకెళ్ళే ట్రాలీ కి ఒక పక్క చక్రం పడవడంతో అక్కడే వదిలేసి వెళ్ళారు గుర్తు తెలియని వ్యక్తులు.ట్రాఫిక్ పోలీసులు,లేదా మున్సిపల్ అధికారులు చొరవ తీసుకుని వెంటనే వాహనదారులు ఇబ్బందుపడకుండా అక్కడినుండి తీసివేయాలని కోరుతున్నారు.

## వ్యక్తిగత శుభ్రత పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం.



భద్రాద్రి కొత్తగూడెం ఆగష్టు 30: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచల మారుతీ నగర్ ఆయుష్మాన్ భరత్ ఆరోగ్య మందిర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సి హేచ్ మానస ఆధ్వర్యంలో స్థానిక వికాస్ డఫ్ అండ్ డం పాఠశాలను సందర్శించారు. అక్కడ ఉన్న విద్యార్థులకు ఆరోగ్య విద్య, వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. చేతులను ఎలా శుభ్రం చేసుకోవాలో వివరించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సి హెచ్ మానస మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా వ్యాధులు గురించి జాగ్రత్త వహించాలని, వాటి లక్షణాలు ఎలా ఉంటాయో వారికీ అర్థం అయ్యేలా వివరించారు. పాఠశాలలో ఉన్న విద్యార్థులకు, అధ్యాపకులకు మలేరియా, డెంగ్యూ పరీక్షలు నిర్వహించారు. ఉచితముగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో హెల్త్ అసిస్టెంట్ రమణ, ఏ ఎన్ ఏం బాలనాగమ్మ, ఆశ వర్కర్ సుజాత, పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా పై పార్టీ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం



సంస్థాన్ నారాయణపురం ఆగస్టు 30(క్రైమ్ మిర్రర్): యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల స్థాయి రాజకీయ పార్టీ ప్రతినిధులతో, శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ప్రమోద్ కుమార్ అధ్యక్షతన సర్పంచ్, వార్డ్ సభ్యుల పోలింగ్ స్టేషన్లు, ఓటర్ల జాబితాపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.260 పోలింగ్ స్టేషన్ , 40096 ఓటర్లు ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలుపగలరు. సెప్టెంబర్ 2న ఫైనల్ లిస్ట్ వెలబడుతుంది అన్నారు.ఈ సమావేశంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ ఉప్పల నాగరాజు, మన్నె నరసింహారెడ్డి, బిఆర్ఎస్ నర్రి నరసింహ, సిపిఐ మల్లారెడ్డి, టీడీపీ సుబ్బారావు, బీజేపీ సూర్వి రాజు గౌడ్, దోనూరి వీరా రెడ్డి ప్రతినిధులు, ఎంపీవో ప్రమోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జస్టిస్ట సుదర్శన్‌రెడ్డికి లెఫ్ట్ మద్దతు

### ఆయన గెలుపు అవసరముందని వెల్లడి

### ఐదు వామపక్షాల విజ్ఞప్తి

న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్): ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేస్తున్న జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని వామపక్షాలు పూర్తిగా బలపరిచాయి. ఆయనను తాము పూర్తిగా బలపరుస్తున్నామని సిపిఐ(ఎం), సిపిఐ, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ (ఆర్ఎస్‌పి), అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ (ఎఐఎఫ్‌బి) తెలిపాయి. అన్నింటికన్నా జాతీయ ప్రయోజనాలే మిన్నగా భావించి, రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని చేసిన ప్రమాణాన్ని గుర్తు చేసుకుని, జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి ఓటు- వేయాల్సిందిగా ఐదు వామపక్షాల నేతలు ఉప రాష్ట్రపతిని ఎన్నుకునే పార్లమెంట్ సభ్యులను కోరారు. ఈ మేరకు సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఆర్ఎస్‌పి ప్రధాన కార్యదర్శి మనోజ్ భట్టాచార్య, ఎఐఎఫ్‌బి ప్రధాన కార్యదర్శి జి.దేవరాజన్ సంయుక్తంగా విజ్ఞప్తి చేశారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ప్రముఖ న్యాయ నిపుణుడు, భారత రాజ్యాంగం కీలక విలువలైన ప్రజాస్వామ్యం, సెక్యులరిజం, సమానత్వం పట్ల ఆయనకు గల అచంచలమైన నిబద్ధతకుగానూ ప్రజల్లో గౌరవాభిమానాలు మెండుగా వున్నాయి.

# దేశ రాజధాని ఢిల్లీలో దారుణం

## ప్రసాదం కోసం సేవకుడిపై దాడి.. దుండగుల కర్రల దాడిలో మృతి

**న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్):** దేశ రాజధాని ఢిల్లీలో ఘోరం జరిగింది. ప్రసాదం వివాదం కారణంగా ఒకరు హత్యకు గురయ్యారు. కొందరు వ్యక్తులు.. ఆలయ సేవకుడిని అత్యంత దారుణంగా కర్రలతో కొట్టి చంపేశారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీలో రికార్డ్ అయ్యారు. ప్రస్తుతం వైరల్‌గా మారాయి.ప్రముఖ కల్కాజీ ఆలయానికి కొందరు వ్యక్తులు దర్శనానికి వచ్చారు. సందర్శన తర్వాత ఆలయ సేవకుడు యోగేంద్ర సింగ్(35)ను ప్రసాదం అడిగారు. అడగ్గానే ప్రసాదం అందజేశాడు. మరింత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందుకు యోగేంద్ర సింగ్ నిరాకరించాడు. దీంతో గొడవకు దిగారు. విచక్షణ మరిచిన గ్యాంగ్ కర్రలు తీసుకుని ఆలయ సేవకుడిపై దాడికి పాల్పడ్డారు. ఒక్కడిని చేసి మూకుమ్మడి దాడికి పాల్పడ్డారు. అక్కడికక్కడే యోగేంద్ర సింగ్ ప్రాణాలు కోల్పోయాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీలో రికార్డ్ అయ్యాయి. బాధితుడు ఉత్తరప్రదేశ్‌లోని హర్దోయ్ జిల్లాలోని ఫట్టేపూర్ ప్రాంతానికి చెందిన యోగేంద్ర సింగ్ (35)గా పోలీసులు గుర్తించారు. గత 14 నుంచి 15 సంవత్సరాలుగా కల్కాజీ ఆలయంలో సేవాదార్‌గా పనిచేస్తున్నాడు. భక్తులకు ఆచారాలు, నైవేద్యాల విషయంలో సహాయం చేస్తుంటాడు. కానీ కొందరు దుండగులు అకారణంగా కొట్టి చంపేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నారు. స్థానికులు బాధితుడిని ఆస్పత్రికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది.. అప్పటికే మరణించినట్లుగా వైద్యులు తెలిపారు. భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల కోసం గాలిస్తున్నారు. దక్షిణపురి నివాసి అయిన 30 ఏళ్ల అతుల్ పాండే అనే నిందితుడిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నట్లు- పోలీసులు పేర్కొన్నారు.

# కుప్పం చేరుకున్న కృష్ణమ్మ

## పరమసముద్రం వద్ద బాబు జలహారతి

## నీటి చేరికతలో సీమ వాసుల్లో ఆనందం



**చిత్తూరు,(క్రైమ్ మిర్రర్):** సొంత నియోజకవర్గం చిత్తూరు జిల్లా కుప్పం పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు కృష్ణమ్మకు జలహారతి ఇచ్చారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ కుప్పం మండలం పరమసముద్రం చెరువు వద్ద హంద్రీనీవా జలాలకు సీఎం జలహారతి ఇచ్చారు. పంచెకట్టుకుని సంప్రదాయ పద్ధతిలో కృష్ణమ్మకు జలహారతి కార్యక్రమంలో పాల్గొన్నారు సీఎం చంద్రబాబు.. వేద మంత్రోచ్ఛారణల మధ్య కృష్ణమ్మకు పసుపు, కుంకమ సమర్పించి జలహారతి ఇచ్చారు.. ఈ జలహారతి కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కుప్పం స్థానిక టీడీపీ నేతలు, ప్రజలు పాల్గొన్నారు.. తమ నియోజకవర్గానికి కృష్ణా జలాలు రావడంపై సంతోషాన్ని వ్యక్తం చేస్తూ.. జై చంద్రబాబు... జైజై చంద్రబాబు అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు కుప్పం ప్రజలు..కుప్పంలో స్త్రీ శక్తి బస్సులో ప్రయాణించారు ముఖ్యమంత్రి చంద్రబాబు .. మహిళలు, రైతులతో కలిసి బస్సులో ప్రయాణించారు.. కుప్పం బ్రాంచ్ కెనాల్ వరకు మహిళలు, రైతులతో సంభాషిస్తూ బస్సులో ప్రయాణం చేశారు. స్త్రీ శక్తి పేరుతో అందిస్తున్న ఉచిత బస్సు సదుపాయం ఎలా ఉందని మహిళలను అడిగి తెలుసుకున్నారు.. తాము ఎక్కడికి వెళ్లినా ఇబ్బంది లేకుండా... ఫ్రీ బస్సులో వెళ్తున్నామని ఆనందం వ్యక్తం చేశారు మహిళలు.. చక్కటి సదుపాయాన్ని కల్పించారని.. తమకు డబ్బులు ఆదా అవుతున్నాయని సీఎంతో చెప్పారు.. హంద్రీ - నీవా ద్వారా కృష్ణా నీళ్లు తొలిసారి కుప్పానికి వచ్చాయి.. కాల్వల్లో నీళ్లు చూశారా..? చెరువులు నిండాయా అంటూ చంద్రబాబు ఆరా తీశారు.. తొలిసారి కుప్పానికి కృష్ణమ్మ వచ్చిందని... చాలా సంతోషంగా ఉందని రైతులు, మహిళలు సీఎం చంద్రబాబు తెలియజేశారు.. మొత్తంగా సీమ ప్రజల ఎన్నో ఏళ్ల కల నెరవేరింది. కరువు సీమ కాదు.. ఇక నుంచి ధాన్య రాశులను పండించే రతనాల సీమ అని చెప్పుకునే సమయం ఆసన్నమైంది. కృష్ణా జలాలు కుప్పం చేరటమే అందుకు కారణం. శ్రీశైలం నుంచి కృష్ణమ్మ వందల కిలోమీటర్లు ప్రయాణించి కుప్పం చేరుకోవడంతో రాయలసీమలో ఆనందోత్సాహం

నెలకొంది. కృష్ణా జలాలు కుప్పం చేరిన వేళ జలహారతి ఇచ్చేందుకు సీఎం చంద్రబాబు శుక్రవారం కుప్పం చేరుకున్నారు. సీమకు పూర్తిస్థాయిలో కృష్ణా జలాలు అనే కలను చంద్రబాబు నిజం చేశారని కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారు. సీమలో ప్రాజెక్టులు మొదలుపెట్టింది ఎన్టీఆర్ అయితే వాటిని ముందుకు తీసుకువెళ్లింది చంద్రబాబు నాయుడు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అతి తక్కువ వర్ష పాతం ఉండే సీమ జిల్లాల్లో నీళ్లతోనే సీమ ప్రజల స్థితిగతులు మారుతాయని హంద్రీ నీవాకు ఉమ్మడి రాష్ట్రంలో 1999 జులై 9 చంద్రబాబు శంకుస్థాపన చేశారు. 2014 నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం భారీ ఎత్తున సాగునీటి ప్రాజెక్టులపై నిధుల ఖర్చు చేయడం వల్ల ఇవాళ హంద్రీనీవా నీళ్లు చిత్తూరు జిల్లాలో చివరి ఆయకట్టు- భూములకు చేరాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాగు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందనే లక్ష్యంతో హంద్రీనీవా ప్రాజెక్టుపై 2014-19 మధ్య రూ.4,183 కోట్లు- ఖర్చు పెట్టారు చంద్రబాబు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రికార్డు స్థాయిలో కేవలం 100 రోజుల్లో మెయిన్ కెనాల్ విస్తరణ, లైనింగ్ పనులు పూర్తి చేసి ప్రధాన కాలువ సామర్థ్యాన్ని 3850 క్యూసెక్కులకు పెంచారు. హంద్రీనీవా కాల్వ విస్తరణ పనులతో సీమకు జలకళ వచ్చింది. ఈ ప్రాజెక్టు ద్వారా మొత్తంగా 6 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీరు అందుతోంది. విస్తరించిన కాల్వల ద్వారా పరుగులు పెడుతున్న కృష్ణమ్మ 19 నియోజకవర్గాలను తాకింది. 10 రిజర్వాయర్‌లను నింపుతోంది. కర్నూలు జిల్లాలో కృష్ణగిరి, పత్తికొండ, అనంతపురం జిల్లాలో జీడిపల్లి, పెన్నా అహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లు నిండాయి. సత్యసాయి జిల్లాలో మారాల, గొల్లపల్లి, చెర్లోపల్లి... అన్నమయ్య జిల్లాలోని శ్రీనివాసాపురం, అడవిపల్లి రిజర్వాయర్లు నిండుతున్నాయి. అలాగే గాజుల దిన్నెకు నీరు చేరింది. హంద్రీనీవా ఆయకట్టు-లో చిట్ట చివరి జిల్లా చిత్తూరు. చిత్తూరు జిల్లాలో 16 లక్షల ఎకరాల సాగుభూమి ఉన్నా... కేవలం 6 లక్షల ఎకరాలకే సాగునీరు అందుతోంది. మిగిలిన 10 లక్షల ఎకరాలకు సాగునీరిస్తే...రైతన్నకు నీటి కొరతే ఉండదు. హంద్రీనీవా రెండో దశ పనులు పూర్తి చేసి జిల్లాలోని 2.20 లక్షల ఎకరాలకు సాగునీరు ప్రభుత్వం ఇవ్వనుంది. పీలేరు, పుంగనూరు, చంద్రగిరి, పూతలపట్టు-, చిత్తూరు, జీడీ నెల్లూరు నియోజకవర్గాల ప్రజలకు దీంతో ప్రయోజనం కలుగుతుంది. జులై 17న కర్నూలు జిల్లా మల్యాల ఎత్తిపోతల నుంచి నీటిని విడుదల చేశారు. నాటి నుంచి హంద్రీనీవా కాలువల్లో ప్రవహించిన కృష్ణమ్మ 738 కి.మీ ప్రయాణించి కుప్పానికి చేరింది. పరమ సముద్రంలో సీఎం చంద్రబాబు కృష్ణా జలాలకు హారతి ఇవ్వడంతో కల నెరవేరింది.

ప్రభుత్వ చిత్తశుద్ధి సంకల్పంతో 40 టీ-ఎంసీల నీటిని ఒక్క హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా రాయల సీమ జిల్లాలు వినియోగించుకోనున్నాయి. చెరువులు అన్ని నింపే కార్యక్రమాన్ని ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించింది. దీంతో సీమలో భూగర్భ జలాలు పెరగనున్నాయి. ఉద్యాన పంటల ఉత్పత్తులు పెంచేందుకు సాగునీటి సౌకర్యం ఎంతో దోహదం చేయనుంది.

# తిరుపతిలో మహిళా ఎమ్మెల్యేల సదస్సు

## సెప్టెంబరు 14, 15 తేదీల్లో నిర్వహణ: స్పీకర్

**అనకాపల్లి,(క్రైమ్ మిర్రర్):** తిరుపతిలో మహిళా ఎమ్మెల్యేల కోసం ప్రత్యేకంగా ఓ సమవేశాన్ని ఏర్పాటుచేస్తున్నామని, సెప్టెంబరు 14, 15 తేదీల్లో మహిళా ఎమ్మెల్యేలకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు-చేస్తున్నట్లు- ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఈ మేరకు అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో మీడియాకు విడుదల చేసిన వీడియోలో ఈ వివరాలు వెల్లడించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల పరిధిలో ఉన్న వివిధ పార్టీలకు చెందిన సుమారు 300 మంది మహిళా ఎమ్మెల్యేలు సదస్సుకు హాజరు కానున్నట్లు- చెప్పారు. ఈ కార్యక్రమానికి తొలిరోజు సీఎం చంద్రబాబు, లోక్‌సభ స్పీకర్ హాజరవుతారని, ముగింపు రోజున గవర్నర్ హాజరుకానున్నారని ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. సదస్సుకు హాజరయ్యే ఎమ్మెల్యేలకు శ్రీవారి దర్శనం కల్పించించేందుకు ఏర్పాట్లు- చేస్తున్నామన్నారు. సెప్టెంబరు 18 నుంచి శాసనసభ సమావేశాలు జరుగుతాయని, ఈమేరకు ఎమ్మెల్యేలకు సమాచారం పంపించినట్లు పేర్కొన్నారు.

# ఆసియా కప్ క్రికెట్ మేనేజర్‌గా ప్రశాంత్

## అభినందించిన డిప్యూటి సీఎం పవన్

**విశాఖపట్నం,(క్రైమ్ మిర్రర్):** దుబాయ్, అబుదాబిలో సెప్టెంబరు 9 నుంచి ప్రారంభమయ్యే ఆసియా కప్ టీ-20 క్రికెట్ పోటీలకు టీమిండియా మేనేజర్‌గా నియమితులైన పీవీఆర్ ప్రశాంత్‌ను ఏపీ డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ అభినందించారు. భీమవరం జనసేన ఎమ్మెల్యే, పీఏసీ ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) కుమారుడైన ప్రశాంత్.. విశాఖ పర్యటనలో ఉన్న పవన్‌ను కలిశారు. తెలుగు వ్యక్తికి ఇలాంటి అరుదైన గౌరవం దక్కడం పట్ల డిప్యూటీ-సీఎం ఆనందం వ్యక్తం చేశారు. ఇది మనకు గర్వకారణమని అన్నారు. భవిష్యత్‌లో ప్రశాంత్ మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) ఉపాధ్యక్షుడిగా పని చేసిన ప్రశాంత్.. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అల్లుడు. గతంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి క్రికెట్‌కు ప్రాతినిధ్యం వహించారు.

# ప్రజలకు అనుగుణంగా పాలన: నారాయణ

**నెల్లూరు,(క్రైమ్ మిర్రర్):** ప్రజల అవసరాలు తెలుసుకుని అందుకు అనుగుణంగా ముందుకు సాగడమే ప్రజాపాలన అని ఏపీ పురపాలకశాఖ మంత్రి నారాయణ అన్నారు. కూటమి ప్రభుత్వం అదే చేస్తోందని అన్నారు. వైకాపా ప్రభుత్వం మాపై కక్షతో అనేక పనులు నిలిపివేసిందని నారాయణ అన్నారు. నెల్లూరులో పర్యటించిన ఆయన.. 15వ డివిజన్ రౌండ్ తూము వద్ద రోడ్డు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు ఏం కావాలో తెలుసుకొని పనిచేయడమే సుపరిపాలన అన్నారు. నెల్లూరులో 6 వాటర్ ఎ÷-లాంట్ల ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తామని చెప్పారు. జిల్లాలో మరికొన్ని బ్రిడ్జిల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైల్వే ట్రాక్‌ల వద్ద అండర్‌పాస్ బ్రిడ్జల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. డ్రెయిన్ల పనులు 10 నెలల్లో పూర్తి చేస్తామని చెప్పారు.

# ప్రజల కోసం ప్రాణాలు అర్పిస్తా

## నిత్యం ముళ్ల ప్రయాణం నాది

## ఎన్నో సమ్మెట దెబ్బలు తిన్న రాజకీయం

## హత్య బెదరింపు వ్యవహారంపై శ్రీధర్ రెడ్డి వ్యాఖ్యలు

**నెల్లూరు,(క్రైమ్ మిర్రర్):** నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేని చంపేస్తే డబ్బే డబ్బు అంటూ రౌడీ షీటర్ల సంభాషణకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.. దీనిపై సోషల్ మీడియా వేదికగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆసక్తికరమైన ట్వీట్ చేశారు. ప్రజల కోసం ప్రాణాలు అర్పించే ఉక్కు సంకల్పం నాది.. నా రాజకీయ జీవితం పూల పాన్పు కాదు.. నిత్యం ముళ్ల మీద ప్రయాణం.. ఎన్నో సమ్మెట దెబ్బలు ఓర్చుకున్న ఈ గుండె తాటాకు చప్పుళ్ళకు బెదరదు.. ప్రజా సేవలో వెనక్కు తగ్గదు.. అంటూ వ్యాఖ్య చేశారు.. ఇక, ఈ వ్యవహారంపై మీడియాతో మాట్లాడిన ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.. ప్రశాంతమైన నెల్లూరులో కొంతమంది రౌడీ షీటర్లు అరాచకాలు చేస్తున్నారు అని దుయ్యబట్టారు.. జులై 1న రౌడీ షీటర్లు కూర్చుని నన్ను చంపాలని మాట్లాడుకున్నారు.. మూడు రోజుల ముందు పోలీసులకు వస్తే.. ఎందుకు నాకు సమాచారం ఇవ్వలేదు..? అని నిలదీశారు.. అసలు, నన్ను చంపితే డబ్బు ఎవరు ఇస్తారనేది పోలీసుల విచారణలో తెలియాలన్నారు.. రాజ్యాధికారం కోసం సొంత ఇంట్లో కుటుంబ సభ్యులను చంపే సంప్రదాయం మా ఇంట్లో లేదని వ్యాఖ్యానించారు. రౌడీ షీటర్లు నా తమ్ముడు గిరిధర్ రెడ్డి అనుచరులు అని ఓ మీడియా రాసిందని మండిపడ్డారు.. విద్యార్థి దశలోనే ఎన్నో పోరాటాలు చేశాను. రౌడీలకు, గుండాలకు భయపడనన్న ఆయన.. వైఎస్ జగన్ ని ధిక్కరించి వీధుల్లోకి వచ్చి పోరాటం చేశాను.. 16 నెలలు అధికారాన్ని వదులుకుని టీ-డీపీలో చేరాను. వైస్సార్సీపీకి సవాల్ విసిరుతున్నా.. ఎన్నిదుష్ప్రచారాలు చేసినా.. వెనకడుగు వేసిదేలన్నారు.. అసలు, నన్ను చంపితే కోట్లు-రూపాయల డబ్బులు ఇస్తామని ఎవరు చెప్పారో పోలీసులు తేల్చాలని డిమాండ్ చేశారు. ఇలాంటి బెదిరింపులకు భయపడను.. నన్ను హత్య చేస్తామని మాట్లాడిన గుండాలకు మా ఇంట్లో చిన్న పిల్లలు కూడా భయపడరు.. నా చివరి శ్వాస, ఓపిక, ఊపిరి ఉన్నంత వరకు ప్రజా జీవితంలోనే ఉంటాను అని ప్రకటించారు కోటంరెడ్డి..వైసీపీతో నాకు తీవ్రంగా విబేధాలు ఉన్నాయి.. వాళ్ల సోషల్ మీడియా నా మీద విషం చిమ్ముతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వచ్చి 14 నెలలు అవుతుంటే.. ఒక్కరికి కూడా నేను నష్టం కల్గించలేదన్న ఆయన.. అసలు, వైస్సార్సీపీ నేతలు నన్ను ఎందుకు గెలుకుతున్నారు..? అని ఫైర్ అయ్యారు.. గత ప్రభుత్వంలో సజ్జల రామకృష్ణారెడ్డి నా గన్‌మెన్‌లను తొలగించారని గుర్తుచేశారు. పోలీసులు ఎక్కడా వైఫల్యం చెందలేదు.. రౌడీయిజంపై ఉక్కుపాదం మోపుతున్నారని పేర్కొన్నారు.. పోలీసులు కఠినంగా వ్యవహరించడం వల్లే నిందితులు జైల్లులో ఉన్నారని తెలిపారు..

# కోటంరెడ్డి హత్యకు కుట్ర

## లోతుగా దర్యాప్తు చేస్తున్న పోలీసులు



**నెల్లూరు,(క్రైమ్ మిర్రర్):** ఎమ్మెల్యే కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డిపై దాడి చేసేందుకు జరిగిన కుట్ర వ్యవహారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తోంది. ఈ కుట్ర చేసిందెవరు? ఆ కుట్ర వెనుక ఉన్నది ఎవరు? అనేది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు.. కోటంరెడ్డి హత్య కుట్ర వీడియోపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. వీడియోలో ఉన్న వారిలో ఒకరు ప్రస్తుతం జైలులో ఉండగా.. మరో నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు- సమాచారం అందుతోంది. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి హత్యకి కుట్రపై పోలీసులు ముమ్మర దర్యాప్తు చేపట్టారు. వీడియోలో ఉన్నది రౌడీషీటర్ శ్రీకాంత్ ముఖ్య అనుచరుడు జగదీశ్, మహేశ్, వినీత్, జకీర్, రాజశేఖర్ రెడ్డిగా గుర్తించారు. వారంతా పాత నేరస్థులు అని నిర్ధారించారు. గతంలో పలు నేరాలకి పాల్పడినట్లు- పోలీసులు వెల్లడించారు. జగదీశ్ ఇటీవల అరెస్ట్ అయ్యి, గంజాయి కేసులో రిమాండ్‌లో ఉన్నాడు. మిగిలిన నలుగురుని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలో ఉన్న అంశం, కుట్ర వెనుక ఎవరున్నారనే వాటిపై పోలీసులు లోతైన దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలాఉంటే.. ఈ వీడియో వైరల్ అవడంతో రాష్ట్ర రాజకీయం ఒక్కసారిగా హీటెక్కింది. హోంమంత్రి అనిత వెంటనే ఎమ్మెల్యే కోటంరెడ్డికి ఫోన్ చేశారు. ప్రభుత్వం మొత్తం అండగా ఉంటు-ందని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. కోటంరెడ్డి అనుచరులు, టీడీపీ శ్రేణులు ఆయన కార్యాలయం వద్దకి ఒక్కొక్కరిగా చేరుకుంటున్నారు.

# టారిఫ్‌లు అక్రమం

(మొదటి పేజీ తరువాయి)

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు అక్కడి అప్పీళ్ల కోర్టు షాక్ ఇచ్చింది. అధికారాలను మితిమీరి వాడేశారని, ఇలా టారిఫ్‌లు పెంచడం పూర్తిగా అక్రమమని వాషింగ్టన్‌లోని 'యూఎస్ కోర్ట్ ఆఫ్ అప్పీల్స్ ఫర్ ది ఫెడరల్ సర్క్యూట్'శుక్రవారం తీర్పు చెప్పింది. "ప్రపంచంలోని ప్రతి దేశంపై ఇష్టారీతిన అంతర్జాతీయ టారిఫ్‌లు పెంచేసే అధికారం, అర్హత అధ్యక్షుడికి లేవు"అని జడ్జీలు 7-%4 మెజార్టీతో తీర్పు చెప్పారు. అధిక టారిఫ్‌లను తప్పుబడుతూ మేలో న్యూయార్క్‌లోని ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పును మేం సమర్థిస్తున్నామని మెజారిటీ జడ్జీలు తమ తీర్పులో అభిప్రాయపడ్డారు. అమెరికా అత్యయిక ఆర్థిక అధికారాల చట్టం(ఐఈఈపీఏ) ప్రకారమే ఈ టారిఫ్‌లు పెంచామన్న ట్రంప్ ప్రభుత్వం చేసిన వాదనలను జడ్జీలు తోసిపుచ్చారు. ఐఈఈపీఏ చట్టానికి విరుద్ధంగా అధ్యక్షుడు నిర్ణయాలు తీసుకున్నారు. అధికారాలను మితిమీరి ఉపయోగించారు. ఇలా భూగోళం మీది ప్రతి ఒక్క దేశంపై టారిఫ్ మోపకూడదు. పెంచిన టారిఫ్‌లను తొలగిస్తే ఇప్పటికిప్పుడే అమెరికా ఆర్థికవ్యవస్థ చిక్కుల్లో పడుతుంది. అందుకే అక్టోబర్ 14వ తేదీదాకా యథాతథ స్థితిని కొనసాగిస్తాం. ఆలోపు ఈ కేసును యూఎస్ సుప్రీంకోర్టు పరిశీలించాలని కోరుతున్నాం"అని 127 పేజీల తీర్పులో అప్పీళ్ల కోర్టు తెలిపింది. తన నిర్ణయాలకు వ్యతిరేకంగా వెలువడిన కోర్టు తీర్పుపై వెంటనే ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో ఆరోపణలు గుప్పించారు. "తీర్పు తర్వాత సైతం నేను విధించిన టారిఫ్‌లు ఇంకొన్ని రోజులు అమల్లోనే ఉండబోతున్నాయి. పక్షపాతధోరణితోనే అప్పీళ్ల కోర్టు టారిఫ్‌లను తప్పుబట్టింది. అప్పీళ్ల కోర్టులో తీర్పు వ్యతిరేకంగా వచ్చిన సుప్రీంకోర్టులో గెలిచి తీరతాం. చివరకు గెలిచేది మేమే. ఒకవేళ టారిఫ్‌లను తొలగిస్తే దేశంలో వినాశనం తప్పదు. అది మన ఆర్థిక వ్యవస్థను బలహీనపరుస్తుంది. వాస్తవానికి మన వ్యవస్థ బలీయంగా ఉండాలి. శత్రువు, మిత్రుడు అనే తేడా లేకుండా మనపై విదేశాలు మోపిన టారి ఫ్‌ల భారాన్ని, వాణిజ్య లోటును అమెరికా సహించబోదు. విదేశాల విధానాలతో మన తయారీసంస్థలు, రైతులుసహా ప్రతి ఒక్కరూ ఇబ్బందిపడుతున్నారు. మన కార్మికులతోపాటు కర్మాగారాలను పరిరక్షించాలంటే విదేశాలపై టారిఫ్‌లను పెంచడమే అత్యుత్తమ మార్గం"అని ట్రంప్ అన్నారు.





# ఆ హీరోయిన్‌ని దారుణంగా విమర్శించిన మృణాల్.. కౌంటర్ ఇచ్చిన బిపాసా

తెలుగు ప్రేక్షకుల మదిలో సీతా మహాలక్ష్మిగా నిలిచిన మృణాల్ ఠాకూర్, ఇటీవల సినిమాల కంటే ఎక్కువగా వ్యక్తిగత విషయాలతో హాట్ టాపిక్ అవుతున్నారు. అక్కినేని సుమంత్‌తో పెళ్లి అంటూ వచ్చిన గాసిప్స్‌కి, ధనుష్‌తో డేటింగ్ అంటూ బాలీవుడ్‌లో చక్కర్లు కొట్టిన వార్తలకు క్లారిటీ వచ్చినట్లు కనిపించినా%%% తాజాగా ఆమె పాత వీడియో ఒకటి వెలుగులోకి వచ్చి మళ్లీ చర్చనీయాంశంగా మారింది. "బిపాసా కంటే నేనే అందంగా ఉంటాను" అంటూ చేసిన కామెంట్స్ వైరల్ అయ్యాయి. మృణాల్ టీవీ సీరియల్స్‌లో నటిస్తూ కెరీర్ ప్రారంభించిన కాలంలో ఆమె ఓ ఇంటర్వ్యూలో బిపాసా బసుపై కాస్త ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఎవరైనా కండలు తిరిగిన అమ్మాయిని పెళ్లి చేసుకోవాలనుకుంటే%%% బిపాసాను చేసుకోండి! నేను బిపాసా కంటే బెటర్‌గా ఉంటాను. ఆడవాళ్లు తనలా నాజుగ్గా ఉండాలని.. బిపాషా మాదిరి కండలు తిరిగిన వారిలా ఉండకూడదని.. ఆమెను చూస్తే మగవారిలా అనిపిస్తుందని మృణాల్ కామెంట్ చేసింది. ఇప్పుడు ఈ కామెంట్స్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. ఇది చాలా పాతదే అయినా ఇప్పుడు తెరపైకి వచ్చింది. ఈ వీడియో వైరల్ అవుతున్న నేపథ్యంలో బిపాసా బసు తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఓ మోటివేషనల్ కోట్ షేర్ చేశారు. బలమైన స్త్రీలు ఒకరికొకరు మద్దతుగా నిలబడాలి. మహిళలు బలంగా కనిపించడం తప్పు కాదు. శారీరక, మానసిక బలం కోసం కండలు అవసరం. పాతకాలపు ఆలోచనలు మార్చండి అనే కొటేషన్ పెట్టింది. నెటిజన్ల అభిప్రాయం ప్రకారం, ఇది మృణాల్ వ్యాఖ్యలకు కౌంటర్ లా ఉందని భావిస్తున్నారు. బిపాసా, ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రోనాల్డోతో కలిసి ఉన్న వీడియోను కూడా అదే సమయంలో షేర్ చేయడం గమనార్హం. ఇది చూసిన కొంతమంది అభిమానులు.. "తన స్థాయిని చూపించేందుకే ఈ వీడియో పెట్టిందా?" అంటూ కామెంట్స్ చేస్తున్నారు. అయితే సోషల్ మీడియాలో ఈ విషయంపై ట్రోల్ నడుస్తున్న క్రమంలో మృణాల్ స్పందించింది. 19 ఏళ్ల వయస్సులో సిల్లీ విషయాల గురించి మాట్లాడాను. అప్పుడు అవి ఎంత బాధిస్తాయో తెలియదు. మెచ్యూరిటీ లేదు. మనస్ఫూర్తిగా క్షమాపణలు చెబుతున్నా. ఒకరిని బాధించడం, ఒకరిని ఇబ్బంది పెట్టాలనేది నా ఇంటెన్షన్ కాదు. ఫ్రెండ్స్‌తో చిట్ చాట్ విషయంలో కాస్త హద్దులు దాటి ఇలా జరిగింది. క్షమించండి అని మృణాల్ పేర్కొంది.

# ఓ ఆటగాడి కథ

విజయ రామరాజు టైటిల్ రోల్‌లో రూపొందిన స్పోర్ట్స్ డ్రామా 'అర్జున్ చక్రవర్తి'. విక్రాంత్ రుద్ర దర్శకత్వంలో శ్రీని గుబ్బల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా యాంథమ్‌ని విడుదల చేశారు. చిత్ర సంగీతదర్శకుడు విఘ్నేష్ భాస్కరన్ స్వరపరచిన ఈపాటకు విక్రాంత్ రుద్ర సాహిత్యం అందించారు. దీపక్ బ్లూ, బృథ్వీవ్ సత్యకుమార్, విఘ్నేష్‌పాయ్ ఆలపించారు. విజయ రామరాజు ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌కి సంబంధించిన విజువల్స్ ఈపాటలో కనిపిస్తాయి. ఓ కబడ్డీ ప్లేయర్ నిజ జీవిత కథతో ఈ చిత్రాన్ని రూపొందించారు. "ఎమోషనల్ కథాంశంతో రూపొందించిన ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తుందనే నమ్మకం ఉంది" అని దర్శక%-%నిర్మాతలు పేర్కొన్నారు.



# మిడిల్ క్లాస్ కుర్రాడు



అమర్‌దీప్, సైలీ జంటగా నటించిన చిత్రం 'సుమతీ శతకం'. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో ఎమ్‌ఎమ్ నాయుడు దర్శకత్వంలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. ఈ సినిమా నుంచి అమర్ దీప్ ఫస్ట్‌లుక్‌పోస్టర్ విడుదల చేశారు. "ఈ చిత్రంలో ఓ మిడిల్ క్లాస్ కుర్రాడిలా అమర్‌దీప్ కనిపిస్తారు. దసరాకి ఈ చిత్రాన్ని రిలీజ్ చేయాలనే లక్ష్యంతో ఉన్నాం" అని చిత్రబృందం పేర్కొంది.

# గ్యాంగ్‌స్టర్ ప్రేయసి



షాహిద్ కపూర్ హీరోగా విశాల్ భరద్వాజ్ దర్శకత్వంలో ఓ గ్యాంగ్‌స్టర్ మూవీ రానున్న సంగతి తెలిసిందే. 1990 నేపథ్యంలో ముంబై మాఫియా నేపథ్యంలో సాగే ఈ సినిమా చిత్రీకరణ త్వరలోనేప్రారంభం కానుంది. అయితే ఈ సినిమాలో మాఫియాతో పాటుగా ప్రేమ సన్నివేశాలు కూడా చాలా కీ˘ంగా ఉండబోతున్నాయని బాలీవుడ్ సమాచారం. ఇందుకు తగ్గట్లుగా విశాల్ భరద్వాజ్ నటీనటుల ఎంపికపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లుగా తెలుస్తోంది. ఈ సినిమాలోని హీరోయిన్స్ పాత్రల కోసం త్రిప్తి దిమ్రి, దిశా పటానీలను ఎంపిక చేసుకున్నారట మేకర్స్. షాహిద్ కపూర్, త్రిప్తి దిమ్రి జోడీగా నటించనున్నారని బాలీవుడ్ సమాచారం. అంతేకాదు... ఈ చిత్రంలోని ఇతర ప్రధాన పాత్రల్లో విక్రాంత్ మెస్సే, రణ్‌దీప్ హుడా, నానా పటేకర్, అవినాష్ తివారి నటించనున్నారని సమాచారం. షాహిద్ కపూర్, విక్రాంత్ మెస్సే, రణ్‌దీప్ హుడా వంటి పాపులర్ హీరోలు ఈ సినిమాలో భాగం కావడంతో ఈ మూవీపై అంచనాలు ఏర్పడుతున్నాయి.

# అడవుల్లో సాహసం



సాహసం చేయడానికి సై అంటూ కథానాయిక సంయుక్త అడవి బాట పట్టారు. దట్టమైన అడవుల్లో ఆమె ట్రెక్కింగ్‌కి వెళ్లారు. అందులోనూ వర్షం కురుస్తుండగా ధైర్యంగా ఈ సాహస యాత్ర చేశారు సంయుక్త. ఈ సాహస యాత్రకి సంబంధించిన ఫొటోలను అభిమానుల కోసం తన సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారామె. "దట్టమైన పచ్చని అడవిలో ప్రకృతి ఒడిలో ట్రెక్కింగ్ అంటే సాహసమే. పైగా వర్షం కురుస్తుండగా ట్రెక్కింగ్‌కి వెళ్లడం ఎంతో మధురానుభూతి. ఈ ట్రెక్కింగ్‌లో ఎన్నో చెప్పలేనన్ని సంతోషాలు, థ్రిల్‌కి గురిచేసే అంశాలున్నాయి. ఇలాంటి గొప్ప అనుభవాలు మీకు ఎదురయ్యాయా?" అంటూ రాసుకొచ్చారు సంయుక్త. ఇక ఆమె నటిస్తున్న తాజా సినిమాల విషయానికొస్తే... తెలుగులో 'అఖండ 2, స్వయంభు, నారీ నారీ నడుమ మురారి, విజయ్ సేతుపతి హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వం వహిస్తున్న చిత్రంలో నటిస్తున్నారు. అలాగే హిందీ, తమిళ, మలయాళ సినిమాలు చేస్తున్నారు.

# థ్రిల్లర్ జానర్‌కి సై?

'నిన్ను కోరి' (2017), 'మజిలీ' (2019), 'ఖుషి' (2023) వంటి ప్రేమకథా చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన దర్శకుడు శివ నిర్వాణ కాస్త రూట్ మార్చి ఓ థ్రిల్లర్ కథను సిద్ధం చేసుకున్నారు. ఇటీవల ఈ స్టోరీని హీరో రవితేజకు వినిపించగా ఆయన ఈ సినిమా చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారట. ఈ థ్రిల్లర్ జానర్ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. అయితే ప్రస్తుతం రవితేజ చేతిలో కిశోర్ తిరుమల దర్శకత్వంలోని 'అనార్కలి' (వర్కింగ్ టైటిల్), భాను భోగవరపు డైరెక్షన్‌లోని 'మాస్ జాతర' సినిమాలు ఉన్నాయి. ఈ రెండు సినిమాల చిత్రీకరణలు పూర్తయిన తర్వాత శివ నిర్వాణతో చేయాల్సిన సినిమాపై ఓ క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. అలాగే 'మ్యాడ్, మ్యాడ్ 2' చిత్రాల ఫేమ్ కల్యాణ్ శంకర్ కూడా ఓ సూపర్ హీరో జానర్‌లో రవితేజకు కథ వినిపించారు. మరి... రవితేజ ఏ దర్శకుడితో ముందుగా తన సినిమాను సెట్స్‌కు తీసుకువెళ్తారో తెలియాలంటే మరికొన్ని రోజులు వెయిట్ చేయక తప్పదు.



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.